

డీఎస్సీకి 73 మంది గైర్హాజరు

నంద్యాల ఎడ్యుకేషన్, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): నంద్యాల జిల్లాలో డీఎస్సీ పరీక్షలకు బుధవారం 73 మంది గైర్హాజరయ్యారు. ఐదు పరీక్షా కేంద్రాల్లో మొదటి సెషన్‌లో నిర్వహించిన స్కూల్ అసిస్టెంట్ (లాంగ్వేజి)ఉర్దూ, టీజీటీ (లాంగ్వేజి) హిందీ పరీక్షలకు మొత్తం 860మంది అభ్యర్థులు హాజరు కావాల్సివుండగా 814మంది హాజరయ్యారు. 46 మంది గైర్హాజరయ్యారు. ఒక్క పరీక్షా కేంద్రంలో రెండో సెషన్‌లో ఫిజికల్ డైరెక్టర్ పరీక్షకు 266 మంది అభ్యర్థులకు గాను 27 మంది గైర్హాజరయ్యారు.

అభివృద్ధే లక్ష్యంగా..

కూటమి ఏడాది పాలన అభివృద్ధి, సంక్షేమమే లక్ష్యంగా సాగింది. వ్యవసాయం, విద్య, వైద్యరంగాల పరంగా అభివృద్ధి పనులు జోరుగా సాగాయి. గ్రామీణ, పట్టణ రహదారులకు సైతం మహర్దశ పట్టింది. పేదలకు అండగా పాలన నిర్వహించారు. డీఎస్సీ ద్వారా అనేక మంది నిరుద్యోగుల్లో ఆనందం వెల్లివిరిసింది. సూపర్-6లో భాగంగా తల్లికి వందనం, అన్నదాత సుఖీభవ, మహిళలకు ఉచిత ప్రయాణం, తదితర హామీలు త్వరలోనే అమలవుతాయనే సంతోషం జిల్లా ప్రజానీకంలో ఉంది. ఏది ఏమైనా గత వైసీపీ పాలనతో విసిగిన ప్రజలకు కూటమి ఏడాది పాలన ఊరటనిచ్చింది. ఇదే క్రమంలో సంక్షేమ ఫలాలు పొందుతామనే ఆనందోత్సాహం వారిలో మొదలైంది. చంద్రబాబు సారథ్యంలోని ప్రజాపాలన ఏడాది పూర్తి చేసుకున్న సందర్భంగా 'ఆంధ్రజ్యోతి' ప్రత్యేక కథనం.


నంద్యాల మున్సిపాలిటీ పద్మావతి నగర్‌లో నిర్మించిన రోడ్డు.

నంద్యాల, జూన్11(ఆంధ్రజ్యోతి): వైసీపీ పాలనలో ప్రజలు అష్టకష్టాలు పడ్డారు. కూటమి ప్రభుత్వం ఏర్పాటుతో పాలన గాడిలో పడుతోంది. రైతులకు గత ఖరీఫ్, రబీ సీజన్‌లలో అధిక దిగుబడులు సాధించేలా కూటమి ప్రభుత్వం ఏడాది పాలనలో తగిన చర్యలు తీసుకుంది. ఆదిశగా అధికారులు, రైతులను అప్రమత్తం చేసింది. జిల్లాలో 1,20,000 హెక్టార్లకే పరిమితమైన వరి పంటను ఖరీఫ్‌లో రైతులకు అన్నివిధాలుగా అండగా నిలిచి 1,63,287 హెక్టార్‌లో సాగుచేసి 73,57,868 క్వింటాళ్ల దిగుబడిని సాధించింది. అన్నదాత సుఖీభవ పేరుతో జిల్లాలోని 3.35లక్షల రైతులలో 1.98 మంది రైతులకు అన్నదాత సుఖీభవ కింద నగదు జమ చేయనున్నారు. 31 వేల కౌలు రైతులకు ఈ పథకం వర్తించేలా చర్యలు తీసుకున్నారు. కూటమి అధికా రంలోకి వచ్చిన ఏడాదిలో జిల్లాలో 40 డ్రోన్ కెమెరాలను మంజూరుచేసి పంపిణీ ప్రారంభించింది. రైతులకు గిట్టుబాటు ధర కల్పించడంతో పాటు ఒక్క రైతు నష్టపోకుండా చర్యలు తీసుకుంది. పంట కొనుగోలు చేసిన 48గంటల్లోనే రైతుల ఖాతాల్లో డబ్బు జమ చేశారు. నంద్యాల జిల్లాలో 4500 మెట్రిక్ టన్నుల కందులను కొనుగోలు చేసి రైతులకు 48 గంటల్లోనే రూ.31,01,31,000 నగదును వారి ఖాతాల్లో జమ చేశారు. జిల్లావ్యాప్తంగా 845మంది రైతులకు 45శాతం సబ్సిడీతో వివిధ రకాల వ్యవసాయ పరికరాలు అందజేశారు. ఇందుకోసం జిల్లాకు సబ్సిడీ రూపంలో సుమారు రూ.28కోట్లు అందజేశారు. పశువులకు నీడ కల్పించేలా 90శాతం సబ్సిడీతో 850 మంది పాడి రైతులకు మినీ గోకులాలు నిర్మించారు.



బండి ఆత్మకూరు మండలంలో

ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి శ్రీకారం..

కూటమి ప్రభుత్వం డీఎస్సీని అమలుచేసి ఉపాధ్యాయ పోస్టుల భర్తీ శ్రీకారం చుట్టింది. గత వైసీపీ హయాంలో ఒకఉపాధ్యాయ పోస్టులను కూడా భర్తీ చేయలేక పోయింది. తాజాగా కూటమి ఏడాదిలోనే ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి మెగా డీఎస్సీ నిర్వహించి ఉమ్మడి జిల్లాలో 2645 పోస్టుల భర్తీ చేయనున్నారు. ప్రతి విద్యార్థికి డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ పేరుమీద రూ.2,279ల విలువచేసే కిట్‌లను పంపిణీచేశారు. ప్రభుత్వ ఉపాధ్యాయుల బదిలీలను ఆన్‌లైన్, మాన్యువల్ విధానాల ద్వారా ఏ సమస్య ఉత్పన్నం కాకుండా సమర్థవంతంగా నిర్వహిస్తున్నారు. పీఎం శ్రీ పథకం కింద 40 పాఠశాలల్లో రూ.152లక్షలతో పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పించనున్నారు. జిల్లాలో 420 ప్రైమరీ పాఠశాలలను మోడల్ పాఠశాలలుగా తీర్చిదిద్దడంతో అన్నిరకాల మౌలిక సదుపాయాలు కల్పించే చర్యలు తీసుకున్నారు. దీంతో ఆయా ప్రాంతాల్లో పనులు జరుగుతున్నాయి.

- గ్రామీణ, పట్టణ రహదారులకు మహర్దశ
- వ్యవసాయ రంగంపై ప్రత్యేక దృష్టి
- రైతులకు 45 శాతం సబ్సిడీతో వ్యవసాయ పరికరాలు
- పేదలకు అండగా పాలన
- డీఎస్సీతో నిరుద్యోగుల్లో వెల్లివిరిసిన ఆనందం
- ఆయా కార్పొరేషన్ల ద్వారా సబ్సిడీ రుణాలు
- పశువుల దాహార్తి తీర్చేందుకు 634 నీటి తొట్ల నిర్మాణం
- ప్రజల ఆరోగ్యానికి పెద్దపీట
- చంద్రబాబు సారథ్యంలోని ప్రజాపాలనకు ఏడాది పూర్తి

పేదలకు సుపరిపాలన



కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఏడాదిలోనే పేదలకు వివిధ రూపాల్లో సుపరిపాలన అందిస్తున్నాం. సూపర్-6 హామీలు అమలు చేస్తాం. అవినీతి లేకుండా ఐటీ పెట్టుబడులు తెచ్చి నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశం కల్పిస్తోంది. ఆర్‌అండ్‌బీ రోడ్ల కోసం రూ. కోట్లను కూటమి ప్రభుత్వం ఏడాదిలోనే ఖర్చు చేసింది.

-బీసీ జనార్దన్‌రెడ్డి, ఆర్‌అండ్‌బీ శాఖ మంత్రి

ముస్లిం మైనార్టీలకు సైతం..



సూపర్ సిక్స్‌ను తప్పక అమలు చేస్తాం. దీంతో పాటు మిగిలిన హామీలను కూడా కూటమి ప్రభుత్వం అమలుచేసేలా చర్యలు తీసుకుంది. డీఎస్సీని సైతం ఏడాదిలో నిర్వహిస్తున్నాం. ముస్లిం, మైనార్టీలకు సైతం కూటమి ప్రభుత్వం అండగా నిలుస్తోంది. ప్రజల నమ్మకం వమ్ముకాకుండా సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ సైతం నిత్యం కృషి చేస్తున్నారు. **● ఎన్‌ఎండీ ఫరూక్, మంత్రి**

వసతి గృహాల నిర్వహణకు..

వసతిగృహాల నిర్వహణకు పెద్దపీట వేసింది. ఇదేక్రమంలో ఆయా మరమ్మతులకు నిధులు మంజూరుచేసింది. అక్కడి విద్యార్థులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకుంది. జిల్లాలోని 31 సాంఘిక సంక్షేమశాఖ వసతి గృహాలకు రూ.18.24 కోట్ల నిధులు మంజూరు చేసి పనులు చేపట్టింది.

వైద్యరంగంలో సమూల మార్పులు..

కూటమి ప్రభుత్వం ఎప్పటికప్పుడు వైద్యరంగంలో సమూల మార్పులు చేస్తూ ప్రజల ఆరోగ్యానికి పెద్దపీట వేస్తున్నారు. జబ్బులవారిగా ఆరాతీయడంతో పాటు క్షేత్రస్థాయిలోనే రోగాలను గుర్తించి సకాలంలో మెరుగైన వైద్యసేవలందించేలా చర్యలు తీసుకున్నారు. నిత్యం సర్వే పేరుతో వైద్యసిబ్బందిని అప్రమత్తం చేస్తున్నారు. అవసరమైతే పవర్ ప్రజెంటేషన్ ద్వారా సీఎం చంద్రబాబు చైతన్యపరుస్తున్నారు.

జిల్లాలోని 489 పంచాయతీలకు..

పశువుల దాహార్తి తీర్చడానికి జిల్లా వ్యాప్తంగా 489 గ్రామ పంచాయతీలు ఉండగా.. 634 నీటి తొట్లు మంజూరు చేసి ఒక్కొక్క నీటితొట్టి నిర్మాణానికి రూ. 35 వేలు చొప్పున మంజూరు చేశారు. ఇప్పటికే జిల్లాలో 90శాతం పనులు పూర్తయ్యాయి. ఇదే తరహాలో మినీగోకులాలు జిల్లాలో 831మంజూరు చేయగా.. ఒక్కొక్కదానికి రూ. 2.30 లక్షలు వరకు మంజూరు చేశారు.

ఏడు నియోజకవర్గాల్లో రూ.9.8కోట్లతో..

జిల్లాలోని ఏడు నియోజకవర్గాల్లో.. కూటమి ఏడాదిలో పాలనలోనే రూ. 9.8 కోట్లతో 430 కిలోమీటర్లు గుంతల మయమైన రోడ్ల మరమ్మతులకు నిధులు మం జూరు చేసి పనులను కూడా పూర్తిచేసింది. వివిధ గ్రాంట్ల కింద రూ. 128.48 కోట్లు మంజూరు చేసి 89పనులకు టెండర్ల పిలిచారు. ఇప్పటికే 20పనులు జరుగుతున్నాయి. దీంతో జిల్లాలో ఆర్‌అండ్‌బీ రోడ్లకు మహర్దశ వచ్చినట్లు అయ్యింది. జిల్లా వ్యాప్తంగా రూ.80.56 కోట్లు నిధులు మంజూరు చేసి 1019 సీసీ రోడ్లను మంజూరు చేశారు. సదరు పనులు కూడా ఇప్పటికే పూర్తి చేశారు. దీంతో గ్రామీణ ప్రజల్లో కూటమి రాకతో తమ పల్లె రహదారులు రూపురేఖలు మారాయనే సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

జలజీవన్ మిషన్ కింద..

జిల్లాలో తాగునీటి కోసం జలజీవన్ మిషన్ కింద 421పనులకు రూ.282.47 కోట్లు మంజూరు చేసింది. ఇప్పటికే 334 పనులు పూర్తి చేశారు. మిగిలిన 72 పనులు జరు గుతున్నాయి. మరో 15పనులకు టెండర్లు పిలవాల్సి ఉంది. డీస్‌లో ఏర్పాటు చేస్తున్న వాటర్ గ్రిడ్‌కు రూ.233.19 కోట్లు పనులు చేయడం జరుగుతోంది. సదరు గ్రిడ్ ద్వారా 138 గ్రామాలతో పాటు రెండు నగర పంచాయతీలకు తాగునీటి సరఫరా చేయడానికి వీలు కలుగనుంది. ఇప్పటికే 61శాతం పనులు పూర్తి అయ్యాయి.నవంబర్ 13కు పూర్తి చేయాలని లక్ష్యం.



అంగన్‌వాడీ కేంద్రాల రూపురేఖలు మారేలా...

కూటమి ప్రభుత్వంలో అంగన్‌వాడీ కేంద్రాల రూపురేఖలు మారేలా చర్యలు తీసుకున్నారు.జిల్లాలో 231 అంగన్‌వాడీ కేంద్రాల్లో మరుగుదొడ్ల నిర్మాణానికి రూ. 82.05 లక్షలు మంజూరు చేశారు. 425 అంగన్‌వాడీ కేంద్రాల్లో రూ.71.79 లక్షలతో తాగునీటి సౌకర్యం కల్పించేలా చర్యలు తీసుకున్నారు. 98 అంగన్‌వాడీ కేంద్రాల్లో రూ.14.11 లక్షలతో రైన్‌వాటర్ హార్వెస్టింగ్ స్ట్రక్చర్‌లు ఏర్పాటు చేయనున్నారు. మొత్తంగా కూటమి రాకతో ఏడాది పాలనలో అంగన్వాడీ కేంద్రాల రూపురేఖలు మారడంతో ఆయా లబ్ధిదారులతో పాటు అంగన్‌వాడీ వర్కర్లు, సిబ్బంది సైతం హర్షం వ్యక్తం చేస్తున్నారు.

కార్పొరేషన్లకు ఊపిరి..

గత వైసీపీ పాలనలో ఎస్సీ, ఎస్టీ, బీసీ కార్పొరేషన్లకు నిధులు కేటాయించకపోవ డంతో పూర్తిగా నిర్వీరమయ్యాయి. ఈనేపథ్యంలో కూటమి రాకతో ఆయా కార్పొ రేషన్లకు ఊపిరి పోసినట్లైంది. ఎస్సీ కార్పొరేషన్‌లో 828యూనిట్లకు దరఖాస్తులు స్వీకరించగా.. 5155 మంది దరఖాస్తులు చేసుకున్నారు. బీసీ కార్పొరేషన్ ద్వారా 2156 యూనిట్లకు 20,151 మంది దరఖాస్తు చేసుకున్నారు. దీంతో త్వరలో ఆయా వాటిలో ఎంపికైనా వారికి రూ.45కోట్లతో త్వరలోనే సబ్సిడీ రుణాలు అందజేయనున్నారు. బీసీ కార్పొరేషన్ ద్వారా మహిళల ఆర్థిక స్వావలంబన కింద ఉచితంగా కుట్టుమిషన్ శిక్షణ అందిస్తున్నారు. ప్రతిఒక్కరికి శిక్షణ అనంతరం ఒక్కొక్కరికి ఒక్కో కుట్టు మిషన్ ఉచితంగా అందజేయనున్నారు. ఈ మేరకు జిల్లాలో 23 కుట్టుమిషన్ శిక్షణ కేంద్రాలు ఏర్పాటుచేసి 2856మందికి శిక్షణ ఇచ్చారు.

ప్రగతి బాటలో పట్టణం

కూటమి ప్రభుత్వం రాగానే నంద్యాల పట్టణం ప్రగతి బాట పట్టింది. పట్టణంలో చాలా కాలంగా ఇబ్బందులు పడుతున్న రోడ్లకు, వివిధ కార్యక్రమాలకు భూమిపూజ చేసి పూర్తిగా 90శాతం పనులు పూర్తిచేశారు. పట్టణంలో 42వార్డులు ఉండగా వాటిల్లో 32వార్డుల్లో 32 రోడ్డు నిర్మాణాలు మంత్రి ఎన్‌ఎండీ ఫరూక్ ప్రారంభి వాటిలో 30రోడ్డు నిర్మాణాలు పూర్తిచేశారు. పద్మావతి నగర్‌లో రోడ్డు నిర్మాణం పూర్తిగా దిగువన ఉండేది. వర్షకాలంలో చిన్నపాటి వర్షానికి పూర్తిగా నీటిమయంగా మారేది. దీంతో రాకపోకలు నిలిచిపోయేవి. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత రూ.1.5కోట్లతో రోడ్డుకిరువైపులా ఎత్తుగా నిర్మించారు. వైఎస్సార్ నగర్, 28, 29, 26 వార్డుల్లో కూడా పూర్తిగా పనులు పూర్తిచేసినట్లు మున్సిపాలిటీ ఇంజినీరింగ్ విభాగం అధికారులు చెబుతున్నారు. ఇంకా పూడికతీతకు ప్రత్యేకంగా రూ.30 లక్షలు, ఈఎల్‌ఎస్ఆర్ వర్కులకు రూ.1.8కోట్లు ప్రత్యేకంగా కేటాయించి పనులు చేస్తున్నారు.

ప్రథమ నందీశ్వర ఆలయాభివృద్ధికి కృషి చేస్తా

- రాష్ట్ర న్యాయ, మైనార్టీశాఖ మంత్రి ఎన్‌ఎండీ ఫరూక్
- ఘన స్వాగతం పలికిన అర్చకులు, అధికారులు


భూమి పూజలో పాల్గొన్న మంత్రి

నంద్యాల కల్చరల్, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): ప్రథమ నందీశ్వర ఆలయాభివృద్ధికి కృషి చేస్తానని రాష్ట్ర న్యాయ, మైనార్టీ శాఖ మంత్రి ఎన్‌ఎండీ ఫరూక్ అన్నారు. బుధవారం ప్రథమ నందీశ్వర ఆలయంలో కొత్తగా నిర్మిస్తున్న వంటశాల, నూతన బోరెవెల్, అసంపూర్తిగా ఉన్న గదుల నిర్మాణానికి మంత్రి ఫరూక్ భూమి పూజ చేశారు. ముందుగా ఆలయ అర్చకులు, అధికారులు మంత్రికి పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అనంతరం మంత్రి ఫరూక్ తనయుడు ఫిరోజ్‌తో కలిసి స్వామివారికి అభిషేకం నిర్వహించి పూజలు చేశారు. భూమి పూజ అనంతరం అక్కడ ఏర్పాటుచేసిన సమావేశంలో మంత్రి పాల్గొని మాట్లాడారు. భవిష్యత్తులో దేవస్థానంలో ట్యాంక్, ఉత్తరం, తూర్పు వైపున మాడవీధులు అలాగే దేవస్థానానికి చెందిన స్థలాన్ని కొలతలు వేయించి ప్రహరీ నిర్మాణం కోసం తనవంతు కృషిచేస్తానన్నారు. దేవస్థానంలోని కళ్యాణమండపం రాజకీయ నాయకుడి పేరుపై ఉండటం సబబు కాదన్నారు. కల్యాణమండపాన్ని స్వాధీనం చేసుకోవాలని ఆలయ అధికారి రామానుజానికి సూచించారు. మంత్రికి తెలిపి త్వరలో స్వాధీనం చేసుకుంటామని ఈవో తెలిపారు. టీడీపీ 32వార్డు ఇన్‌చార్జి బుడంకాయల శేఖర్ ఒక గదికి, శేశిరెడ్డి ఒక గది నిర్మాణానికి ముందుకొచ్చారు. కార్యక్రమంలో కౌన్సిలర్ ఖండే శ్యామ్‌సుందర్‌లాల్, చలంబాబు, ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు రామశివారెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, రజనీకాంత్ రెడ్డి, కృష్ణారెడ్డి, వరప్రసాద్, నరసింహులు, సుధాకర్, రమణ పాల్గొన్నారు.

బడికి వేళాయే

నూతన విద్యావిధానంతో నేటి నుంచి పాఠశాలలు



నంద్యాల ఎడ్యుకేషన్, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): వేసవి సెలవుల తర్వాత నూతన విద్యావిధానంతో నేడు పాఠశాలలు పునఃప్రారంభం కానున్నాయి. విద్యారంగాన్ని తీర్చిదిద్దడానికి ప్రభుత్వం అనేక పథకాలు చేపట్టింది. ఈ విద్యా సంవత్సరం నుంచి అవన్నీ అమలులోకి రానున్నాయి. జిల్లాలో 1959 పాఠశాలలుండగా అందులో 1171 ప్రైమరీ స్కూల్స్, 298 యూపీఎస్, 490 ఉన్నత పాఠశాలలు ఉన్నాయి. నూతన విద్యావిధానం ప్రకారం 420 మోడల్ ప్రైమరీ పాఠశాలలు కొత్తగా ఏర్పడ్డాయి. అన్ని పాఠశాలల్లో 3,14,118 మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. 11,293 మంది ఉపాధ్యాయులు పాఠశాలల్లో పని చేస్తున్నారు. ఈ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు డాక్టర్ సర్వేపలి రాధాకృష్ణణ్ విద్యార్థిమిత్ర పథకం ద్వారా కిట్లను సిద్ధం చేశారు. పాఠశాల తెరిచిన మొదటి రోజే విద్యార్థులకు పంపిణీ చేసేలా అధికారులు చర్యలు తీసుకున్నారు. ఒక్కో కిట్‌లో బ్యాగ్, బెల్ట్, డిక్షనరీ, నోట్‌బుక్స్, షూస్, రెండుజతల యూనిఫామ్ ఇవ్వనున్నారు. యూనిఫామ్ కుట్టించుకునేందుకు 1వతరగతి నుంచి 8వతరగతి విద్యార్థులకు రూ.120, 9 నుంచి 10వతరగతి విద్యార్థులకు రూ.240 ఇవ్వనున్నారు. యూనిఫాంను ప్రస్తుత ప్రభుత్వం సమూలంగా మార్చింది. బెల్టులపై గతంలో విద్యాకానుక అని ముద్రించగా నేడు సర్వేపల్లి రాధాకృష్ణన్ ఫొటో ఉన్న లోగోను ముద్రించనున్నారు. విద్యార్థి కిట్‌తో పాటు అదనంగా పాఠ్యపుస్తకాలు, వర్క్ బుక్స్ ఇవ్వనున్నారు.

నాగలి పట్టిన కలెక్టర్



నంద్యాల ఎడ్యుకేషన్, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): నంద్యాల జిల్లా ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ పరిశోధనా సంస్థలో ఘనంగా నిర్వహించిన ఏరువాక పౌర్ణమి వేడుకలో కలెక్టర్ రాజకుమారి పాల్గొన్నారు. రైతులు, వ్యవసాయాధికారులు, శాస్త్రవేత్తల మధ్య మన సంస్కృతి, సంప్రదాయాలు ప్రతిబింబించేలా జిల్లా వ్యవసాయాధికారి మురళీకృష్ణ ఆధ్వర్యంలో ఏరువాక పౌర్ణమి వేడుకను నిర్వహించారు. అందంగా అలంకరించిన ఎద్దులకు ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం కలెక్టర్ రాజకుమారి కాడిపట్టి నాగలితో అరక దున్నుతూ వ్యవసాయ పనులను ప్రారంభించారు.



జగన్ తప్పిదాలను సరిచేస్తున్నాం

- రూ. 58 కోట్లతో గోరుకల్లు రిజర్వాయర్ మరమ్మతులకు ప్రతిపాదనలు
- మంత్రి నిమ్మల రామానాయుడు


కుంగిన రాతి పరుపును పరిశీలిస్తున్న మంత్రి నిమ్మల

పాణ్యం, జూన్ 11 (ఆంధ్రజ్యోతి) : గత ప్రభుత్వంలో వైఎస్ జగన్ చేసిన తప్పిదాలు సరిచేస్తూ రాష్ట్ర అభివృద్ధికి కృషి చేస్తున్నట్లు రాష్ట్ర భారీ నీటిపారుదల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు అన్నారు. పాణ్యం మండలంలోని గోరుకల్లు రిజర్వాయర్‌ను (నరసింహరాయ సాగర్) బుధవారం ఈయన పరిశీలించారు. రిజర్వాయర్‌లో కుంగిన రాతి పరుపును పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ జగన్ ఐదేళ్ల విధ్వంస పాలనలో పోలవరం నుంచి గోరుకల్లు వరకు నీటి ప్రాజెక్టులన్నీ నిర్లక్ష్యానికి గురయ్యాయన్నారు. గోరుకల్లు రిజర్వాయర్‌కు ఒక్కరూపాయి కేటాయించలేదని అన్నారు. రిజర్వాయర్ బ్యాలెన్స్ పనులు పూర్తి చేయకపోవడంతోనే మరింత ఆర్థిక భారం ప్రభుత్వంపై పడిందన్నారు. గోరుకల్లు రిజర్వాయర్ నిండితేనే రాయలసీమలోని మిగతా రిజర్వాయర్లు నిండుతాయని అన్నారు. ఈ రిజర్వాయర్ మర మ్మతులకు రూ. 58 కోట్ల అంచనాలతో ఆర్థిక శాఖకు ప్రతిపా దనలు పంపినట్లు తెలిపారు. శ్రీశైలం ప్లంజ్ పూల్ మరమ్మతుల కోసం రూ. 30 కోట్లు కేటాయించి మరమ్మతులు చేపడుతున్నామన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక గత ప్రభుత్వం తప్పిదాలు సరిచేయ డానికే సరిపోయిందన్నారు. రెవెన్యూ, మైనింగ్, వ్యవసాయ తదితర రంగాలు పూర్తి అస్తవ్యస్తమయ్యాయన్నారు. ఈ కార్యక్రమంలో పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరిత, తహసీల్దారు నరేంద్రనాథ్ రెడ్డి, ఎస్ఐలు నరేంద్ర కుమార్‌రెడ్డి, నాగార్జునరెడ్డి, నీటిపారుదల శాఖ అధికారులు పాల్గొన్నారు.

సంగమేశ్వరాలయాన్ని చుట్టుముట్టిన వరద నీరు



సంగమేశ్వరాలయాన్ని చుట్టుముట్టిన వరద జలాలు

కొత్తపల్లి, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): గత పది రోజులుగా ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న భారీ వర్షాలకు దిగువన ఉన్న శ్రీశైలం రిజర్వాయరుకు వరద నీరు వచ్చి చేరుతుండటంతో సప్తనదుల సంగేశ్వర ఆలయం చుట్టూ కృష్ణా జలాలు వచ్చి చేరుతున్నాయి. బుధవారం సాయంత్రం 6 గంటల సమయానికి శ్రీశైలం ప్రాజెక్టు పూర్తి స్థాయి నీ టి మట్టం 885 అడుగులు కాగా, 836 అడుగులకు చేరుకుంది. అలాగే రిజర్వాయరు పూర్తి స్థాయి నీటి నిల్వలు 215 టీఎంసీలు కాగా, 56.2910 టీఎంసీలుగా నమోదైంది. కేవలం ప్రాజెక్టు నీటి మట్టం నాలుగు అడుగులు పెరిగితే సంగమేశ్వర ఆలయంలోని వరదనీరు చేరే అవకాశం ఉంది. ఆలయం చుట్టూ వరద జలాలు వచ్చి చేరుతుండటంతో సంగమేశ్వరం పరిసర ప్రాంతాల్లో పర్యాటకుల తాకిడి అధికమైంది.

డబ్బులు కొల్లగొట్టడానికే గోదావరి-బనకచర్ల

ఏపీ రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఈశ్వరయ్య

కర్నూలు న్యూసిటీ, జూన్ 11(ఆంధ్రజ్యోతి): వేలకోట్ల రూపాయలు కొల్లగొట్టడానికే ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు గోదావరి- బనకచర్ల ప్రాజెక్టును ముందుకు తెస్తున్నారని ఏపీ రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జీ. ఈశ్వరయ్య విమర్శించారు. బుధవారం సీఆర్ భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాయలసీమలో పెండింగ్‌లో ఉన్న సాగునీటి ప్రాజెక్టులను ప్రాధాన్యతా క్రమంలో పూర్తి చేయాలన్నారు. ఏడాది కూటమి ప్రభుత్వం ఎంతో అభివృద్ధి చేసినట్లు డబ్బాకొట్టుకుం టున్నారని అన్నారు. ఏడాది కాలంలో రైతులకు ఏమి చేశారో చంద్రబాబు నాయుడు చెప్పాలని డిమాండ్‌చేశారు. రైతులకు 90 శాతం సబ్సిడీతో విత్తనాలు పంపిణీ చేయాలన్నారు. శ్రీశైలం ప్రాజెక్టు పూర్తిగా దెబ్బ తిని ప్రమాదం పొంచి ఉందని నిపుణులు చెబుతున్న రాష్ట్ర ప్రభుత్వం ఎందుకు పట్టించుకోవడం లేదని విమర్శించారు. 2014-2019 వరకు ఏపీ అంటే ఏ అంటే అమరావతి అని పీ అంటే పోలవరం అన్నట్లుగా చంద్రబాబునాయుడు పని చేశారని గుర్తు చేశారు. 2024లో కూడ అధికారంలోకి వచ్చాక అమరావతి-బానకచర్ల అంటూ కాలయాపన చేస్తున్నారని విమర్శించారు. ముఖ్యంగా జిల్లాకు వేదవతి, గుండ్రేవుల, ఆర్‌డీఎస్ కుడి కాలువల నిర్మాణం ఎందుకు పూర్తి చేయడం లేదన్నారు. ఈ సమావేశంలో రాష్ట్ర కార్యదర్శి కే.జగన్నాథం, జిల్లా సహాయ కార్యదర్శి ఎస్. మునెప్ప, ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి కే. శ్రీనివాసులు, ఏఐటీయూసీ డిప్యూటీ కార్యదర్శి రామాంజనేయులు, బీసన్న పాల్గొన్నారు.

ఏరువాక వేడుకల్లో అపశ్రుతి

విద్యుదాఘాతంతో బాలుడి మృతి

ఆదోని రూరల్, జూన్ 11 ఆంధ్రజ్యోతి): మండలంలోని కపటి గ్రామంలో ఏరువాక పౌర్ణమి వేడుకల్లో బాలుడు మృతిచెందాడు. వివరాల మేరకు.. గ్రామానికి చెందిన ఈరన్న, లక్ష్మి దంపతుల కుమారుడు సురేంద్ర(13) ఎద్దులకు రేకుల షెడ్‌లో రంగులు వేస్తుండగా వర్షం కురిసి, షెడ్‌కు విద్యుత్ తీగలు తగలడంతో బాలుడు విద్యుదాఘాతంతో కిందపడిపోయాడు. గమనించిన కుటుంబ సభ్యులు బాలుడిని తప్పించడానికి ప్రయత్నించగా వారు కూడా విద్యుదాఘాతానికి గురికావడంతో విద్యుత్ సరఫరా నిలిపివేసి, బాలుడిని ఆదోని ఆసుపత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు తెలిపారు.

అనాథ వృద్ధురాలికి అంత్యక్రియలు

● ఔదార్యం చాటుకున్న డిప్యూటీ తహసీల్దారు

ఉయ్యాలవాడ, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): రక్తసంబంధీకులు ఉన్నా అనాథగా మిగిలిన వృద్ధురాలి మృతదేహానికి డిప్యూటీ తహసీల్దారు ప్రసాద్‌బాబు అంత్యక్రియలు నిర్వహించారు. ఈ ఘటన నంద్యాల జిల్లా ఉయ్యాలవాడ మండలం రూపనగుడిలో చోటు చేసుకుంది. ముసలిగాళ రామక్క (70) కొన్నేళ్లుగా అహోబిళం క్షేత్రంలో భిక్షాటన చేస్తూ జీవించేది. రూపనగుడిలోని ఎస్సీకాలనీలో మేనల్లుళ్లు ఉండటంతో 30 రోజుల కింద గ్రామానికి వచ్చింది. ఆమె బుధవారం ఉదయం ఆమె మృతిచెందింది. ఆమె కుమారులు మద్దూరు గ్రామంలో ఉన్నారు. వారు మృతదేహాన్ని తీసుకెళ్లడం నిరాకరించారు. మృతురాలికి అంత్యక్రియలు చేసేందుకు ఎవరూ ముందుకు రాలేదని స్థానికులు డిప్యూటీ తహసీల్దారు ప్రసాద్‌బాబుకు సమాచారం ఇచ్చారు. ఆయన వెంటనే స్పందించి తన సిబ్బందితో గ్రామానికి చేరుకుని తన సొంత ఖర్చులతో అంత్యక్రియలు చేపట్టారు. గ్రామంలోని గ్రీన్ అంబాసిడర్లను వీఆర్‌ఏలను వెంట తీసుకెళ్లి మృతురాలికి స్థానిక కుందూనదిలో అంత్యక్రియలు చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ అంకన్న, వీఆర్వోలు వెంకటలక్ష్మి, దాదాసాహెబ్, దస్తగిరి, హెడ్‌కానిస్టేబుల్ నూర్ అహ్మద్ తదితరులు పాల్గొన్నారు.

బదిలీకి అర్హుల జాబితా విడుదల

సీనియారిటీ ఉన్నా కనపడని పలువురి పేర్లు

కర్నూలు హస్పిటల్, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): వైద్యఆరోగ్య శాఖ కడప జోన్-4 పరిధిలోని సాధారణ బదిలీల అర్హులైన జాబితాను స్థలాల ఎంపిక వివరాలను కడప రీజనల్ డైరెక్టర్ డా.రామగిడ్డయ్య వెబ్‌సైట్‌లో విడుదల చేశారు. ఈ జాబితాలో కర్నూలు జీజీహెచ్‌లోని ఓ సీనియర్ అసిస్టెంట్ పేరు పొందుపరచకపోవడం విశేషం. కర్నూలు మెడికల్ కాలేజీ కార్యాలయంలో ఓఅధికారి సీనియారిటీని ఐదేళ్లు ఉంటే కేవలం రెండేళ్లు చూపించారు. ఇక కడప ఆర్‌డీ కార్యాలయంలో కొందరు ఉద్యోగులను జాబితాలో పేర్లు కనబరచలేదు. మరో పక్క ఓ యూనియన్ గుర్తింపు వ్యవహారంపై విచారణ కొనసాగుతుండగా.. దానిపై పూర్తి నివేదిక రాకుండానే ఆ యూనియన్‌ను పరిగణనలోకి తీసుకుని జాబితాలో ప్రస్తావించడంపై కొంత యూనియన్ నేతలు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నాయి. సమగ్ర విచారణ పూర్తి కాకుండా ఉత్తర్వులు జారీ చేయడం రికాదని కొందరు యూనియన్ నేతలు విమర్శిస్తున్నారు. ఇప్పటికే అన్ని క్యాడర్లుకు సంబంధించిన ఉద్యోగుల జాబితాను విడుదల చేయడంతో ఎక్కడైనా తప్పులు ఉంటే దాన్ని సరిదిద్దేందుకు రెండు రోజులు గ్రీవెన్స్‌కు అధికారులు సమయం ఇచ్చారు.

కుంటలోకి దూసుకెళ్లిన ట్రాక్టర్



బయటకు లాగుతున్న మరో ట్రాక్టర్

మద్దికెర, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): గ్రామానికి చెందిన ట్రాక్టర్ అదుపు తప్పి మద్దమ్మ కుంటలోకి దూసుకెళ్లింది. వివరాల మేరకు.. బుధవారం ఎరువాక పౌర్ణమి సందర్భంగా యజమాని శేఖర్ ట్రాక్టర్‌ను శుభ్రం చేసేందుకు కుంటలోకి తీసుకెళ్లాడు. అయితే.. లోతు ఎక్కువగా ఉండటంతో ట్రాక్టర్ అలాగే దూసుకెళ్లి మునిగి పోయింది. చుట్టుపక్కల వారు వేరే ట్రాక్టర్ సాయంతో బయటకు లాగారు. ఎవరికీ ప్రమాదం జరగకపోవడంతో స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు.

పోరాటాలతో పార్టీని బలోపేతం చేద్దాం

● అంతా కలిసి పని చేద్దాం- పీసీసీ అధ్యక్షురాలు షర్మిల

● నాయకులు, కార్యకర్తలు, కో ఆర్డినేటర్లకు నిర్దేశం



మాట్లాడుతున్న పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల



పాల్గొన్న కాంగ్రెస్ కార్యకర్తలు

కర్నూలు అర్బన్, జూన్ 11(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వ వైఫల్యాలపై పోరాడుతూ కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేద్దామని పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల అన్నారు. బుధవారం జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో నాయకులు, కార్యకర్తలతో విస్తృత స్థాయి సమావేశం జరిగింది. జిల్లా పార్టీ వ్యవహారాల ఇన్‌చార్జి, పీసీసీ ప్రధాన కార్యదర్శి అంబటి రామకృష్ణ యాదవ్, నంద్యాల డీసీసీ జె. లక్ష్మీనరసింహయాదవ్, నగర అధ్యక్షుడు షేక్ జిలానీ బాషా ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమానికి జిల్లాలోని 7 నియోజకవర్గాల నాయకులు, కార్యకర్తలు హాజరయ్యారు. ఈసందర్భంగా కర్నూలు, కోడుమూరు, ఎమ్మిగనూరుకు సంబంధించిన నాయకులు పార్టీలోని సంస్థాగత సమస్యలు, లోపాలను లేవనెత్తారు. డీసీసీ నియామకం లేకపోవడంతో పార్టీలో నాయకత్వ లోపం ఏర్పడిందని, గాడిలో పెట్టాల్సిన అవసరం ఉందని వారు పీసీసీ దృష్టికి తీసుకెళ్లారు. పలువురు కోఆర్డినేటర్లు తమను కలుపుకుని పోవడం లేదని ఫిర్యాదు చేశారు. దీనిపై షర్మిల మాట్లాడుతూ నగర అధ్యక్షుడు షేక్ జిలానీ చొరవ తీసుకుని పార్టీని మూడు నెలల్లో గాడిలో పెట్టేలా చర్యలు తీసుకోవాలన్నారు. పార్టీలో నాయకులు, కార్యకర్తలు, కో ఆర్డినేటర్లు సమన్వయంతో పనిచేయాలని, స్థానిక సమస్యలపై పోరాటాలు చేయాలని దిశా నిర్దేశం చేశారు. సమన్వయం లేకపోవడంతో ఇబ్బందులు ఉన్నట్లు తెలుస్తోందని, ఇకపై అలాంటి సమస్యలు లేకుండా చర్యలు తీసుకుంటామని, అందరం కలిసి పని చేద్దామని అన్నారు. ఈ కార్యక్రమంలో దామోదరం రాధాకృష్ణ, అనంతరత్నం మాదిగ, మాజీ ఎమ్మెల్సీ సుధాకర్ బాబు, ఐఎన్‌టీయూసీ జిల్లా అధ్యక్షుడు బ్రతుకన్న, బజారన్న, లాజరస్, ప్రమీలమ్మ, పలువురు నాయకులు పాల్గొన్నారు.

వీడిన మిస్టరీ

● మాజీ ఎంపీటీసీ రమేష్ నాయుడు హత్య కేసులో నిందితుల అరెస్టు

● నష్టపరిహారం రాకుండా అడ్డుపడ్డాడని హత్య



నిందితుల అరెస్టు చూపిస్తున్న డీఎస్పీ శ్రీనివాసాచారి

కర్నూలు క్రైం, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): ఓర్వకల్లు మండలం మీదివేముల మాజీ ఎంపీటీసీ బోయ రమేష్ నాయుడు హత్య కేసు మిస్టరీ వీడింది. గత వైసీపీ ప్రభుత్వంలో భూములను తమ పేరు మీద లేకుండా చేసి నష్టపరిహారం రాకుండా అడ్డు పడినందుకే కక్ష పెంచుకున్న కొందరు రమేష్ నాయుడును హతమార్చినట్లు పోలీసులు వెల్లడించారు. డీఎస్పీ శ్రీనివాసాచారి, రూరల్ సీఐ చంద్రబాబు నాయుడు, ఎస్ఐ సునీల్ కుమార్‌లు బుధవారం రాత్రి కర్నూలు రూరల్ పోలీస్ స్టేషన్‌లో కేసు వివరాలు వెల్లడించారు. ఈ నెల 5వ తేదీన రాత్రి 10 గంటల ప్రాంతంలో ఓర్వకల్లు మండలం మీదివేముల సమీపంలో రమేష్‌నాయుడు హత్యకు గురయ్యాడు. ఈ కేసులో నిందితులు మేడం రామాంజనేయులు, మేడం తిరుపాలు, మేడం శ్రీనివాసులు, మేడం రామకృష్ణలను అరెస్టు చేశారు. హత్యకుగురైన రమేష్‌నాయుడు వైసీపీలో కీలకంగా ఉన్నాడు. గత ప్రభుత్వ హయాంలో ప్రధాన నిందితుడు మేడం రామాంజనేయులు, అతడి బంధువులు ప్రభుత్వ భూములు సాగుచేసుకుంటూ ఉన్నారు. ఏపీఐఐసీ సంస్థ ఈ ప్రభుత్వ భూములు సేకరించింది. ఆన్‌లైన్‌లో పేర్లు ఉన్న వారికి నష్టపరిహారం చెల్లించింది. అయితే మేడం రామాంజనేయులు, ఆయన బంధువులు సాగు చేసుకుంటున్న ప్రభుత్వ భూములను ఆన్‌లైన్ చేయకుండా బోయ రమేష్ నాయుడు గ్రామ నాయకుల వైసీపీ నాయకుల అండతో అడ్డుపడ్డాడు. దీంతో ఏపీఐఐసీ సంస్థ ఆ భూములను తీసుకున్నప్పటికీ రామాంజనేయులు వర్గానికి నష్టపరిహారం అందలేదు. దీంతో మేడం రామాంజనేయులు బోయ రమేష్ నాయుడుపై కక్ష పెంచుకున్నాడు.

కాపు కాచి హత్య

ఈ నెల ఐదో తేదీన రమేష్ నాయుడు ఓ పంచాయతీ కోసం కర్నూలు తాలుకా పోలీస్ స్టేషన్‌కు వచ్చాడు. పంచాయతీ ముగించుకుని తిరిగి తనస్కూటీపై ఇంటికి వెళ్తుండగా.. మేడం రామాంజనేయులు, మేడం రామకృష్ణ కూడా కర్నూలు నుంచి మీదివేముల వెళ్తున్నారు. దారిలో ఒంటరిగా వెళ్తున్న రమేష్ నాయుడును గుర్తించారు. అప్పటికప్పుడు ప్లాన్ వేసి మీదివేముల వద్ద కాపు కాచారు. రాత్రి 10 గంటల ప్రాంతంలో రమేష్ నాయుడుపై దాడి చేశారు. బీరు సీసాలతో మొఖంపై కొట్టి, పక్కనే ఉన్న బండరాయితో తలపై మోదీ హత్య చేశారు. ఈ హత్యలో మేడం తిరుపాలు, మేడం శ్రీనివాసులు సహకరించారు. వీరు దరించిన దుస్తులన్నీ పక్కనే కాల్చేసి ఊరికి చేరుకున్నారు. అయితే మేడం రామాంజనేయులు భయంతో అక్కడి నుంచి వెళ్లిపోగా, మిగతా నిందితులు గ్రామంలో ఉన్నారు. మొదట పోలీసులకు వీరిపై అనుమానం రాలేదు. సాంకేతిక పరిజ్ఞానం ఉపయోగించి మేడం రామాంజనేయులు హత్య చేసినట్లు గుర్తించి ప్రధాన నిందితులతో పాటు సహకరించిన వారిని అరెస్టు చేశారు. మేడం రామాంజనేయులుకు రమేష్ నాయుడుకు 2015లో గొడవ జరిగింది. ఆ కేసులో కౌంటర్ కేసులు కూడా పెట్టుకున్నారు. అయితే కొద్ది కాలానికి రాజీ అయ్యారు. ఇదిలా ఉండగా ప్రధాన నిందితుడు మేడం తిరుపాలు 1994లో జరిగిన రాముడు హత్య కేసులో 8వ ముద్దాయి. ఆ కేసులో జీవిత ఖైదు పడింది. 2001 నుంచి 2009 వరకు జైలు శిక్ష అనుభవించి క్షమాభిక్షపై బయటకు వచ్చాడు. మరోసారి హత్య కేసులో నిందితుడిగా మారాడు.

వ్యవసాయ శాఖలో బదిలీలు

● కీలకంగా మారిన సిఫారసులు

● 45 మంది మండల వ్యవసాయాధికారులు, 12 మంది ఏడీఏల ట్రాన్స్‌ఫర్



కర్నూలు అగ్రికల్చర్, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో కీలకమైన వ్యవసాయ శాఖలో బదిలీల పర్వం కొనసాగింది. పెద్ద ఎత్తున నేతల సిఫారసులు, దండిగా డబ్బులు వెదజల్లిన వారికే కోరుకున్న చోటకు బదిలీలు దక్కాయి. ఉమ్మడి కర్నూలు జిల్లాలో 45 మంది వ్యవసాయాధికారులు, 12 మంది ఏడీఏలకు కోరుకున్న వారికి కోరుకున్న స్థలాలు దక్కాయి. ఓర్వకల్లు మండల వ్యవసాయాధికారిగా మధుమతి, బండి ఆత్మకూరు ఏవోగా హేమలత, అవుకు ఏవోగా కళాముని, కౌతాళం ఏవోగా విజయజ్యోతి నియమితులయ్యారు. అత్యంత ప్రాధాన్యత కలిగిన కల్లూరు మండల ఏవోగా విష్ణువర్ధన్ రెడ్డి, ఆదోని ఏవోగా పాపిరెడ్డి నియమితులయ్యారు. ఎమ్మిగనూరు ఏవోగా శివశంకర్, కల్లూరు ఏవో శ్రీనివాసరెడ్డి పగిద్యాలకు, కర్నూలు ఏడీఏ కార్యాలయంలో టెక్నికల్ ఏవోగా పని చేస్తున్న దస్తగిరి రెడ్డి గూడూరుకు బదిలీ అయ్యారు. కౌతాళం ఏవో శేషాద్రి అనంతపురం జిల్లా ఆత్మకూరుకు బదిలీ అయ్యారు. ఆదోని ఏవో అశోక్ కుమార్‌రెడ్డి జే. బంగ్లా తంగడంచ ఫామ్‌కు బదిలీపై వెళ్లారు. ఓర్వకల్లు ఏవో సుధాకర్ ఎమ్మిగనూరు వ్యవసాయ క్షేత్రానికి బదిలీపై వెళ్లారు. ఉమ్మడి కర్నూలు జిల్లాలో 12 మంది ఏడీఏలకు బదిలీ ఉత్తర్వులు జారీ చేస్తూ వ్యవసాయ శాఖ డైరెక్టర్ డిల్లీ రావు జేడీఏ కార్యాలయానికి పంపారు. నంద్యాల డీఆర్‌సీ ఏడీఏగా పని చేస్తున్న సుధాకర్‌ను కోవెలకుంట్లకు, నంద్యాల ఏడీఏ రాజశేఖర్ కర్నూలు ఆగ్రనమి విభాగానికి, డోన్ ఏడీఏ అశోక్‌వర్ధన్ రెడ్డిని ఎమ్మిగనూరు ఎస్‌టీఎల్ విభాగానికి బదిలీ చేశారు. ఆలూరులో పని చేస్తున్న సునీతను డోన్‌కు, ఆదోని ఏడీఏ అరుణకుమారిని కర్నూలు డీఆర్‌సీకి బదిలీ చేశారు. కర్నూలు ఆగ్రనమి విభాగంలో పని చేస్తున్న బాలమద్దిరాజును ఆదోని ఏడీఏగా బదిలీ చేశారు. కర్నూలు డీఆర్‌సీలో పని చేస్తున్న మద్దిలేటిని రాయచోటికి, ఎమ్మిగనూరు సీడ్ టెస్టింగ్ ల్యాబ్ ఏడీఏ శైల కుమారిని చిత్తూరు డీఆర్‌సీకి, పలమనేరులో పని చేస్తున్న అన్నపూర్ణను ఎమ్మిగనూరు సీడ్ టెస్టింగ్ ల్యాబ్‌కు బదిలీ చేశారు. కర్నూలు డీఆర్‌సీలో పని చేస్తున్న గిరీష్‌కు నంద్యాల రెగ్యులర్ ఏడీఏగా దక్కింది.

ఉజ్వల భవిష్యత్‌ను నాశనం చేసుకోవద్దు



మాట్లాడుతున్న సీఐ ప్రసాద్‌రావు

నంద్యాల, రూరల్ జూన్11(ఆంధ్రజ్యోతి): డ్రగ్స్‌ను సేవించి తమ ఉజ్వల భవిష్యత్‌ను నాశనం చేసుకోవద్దని శ్రీశైలం ఈవో శ్రీనివాసరావు, సీఐ ప్రసాద్‌రావు పేర్కొన్నారు. ఈ మేరకు శ్రీశైలంలో బుధవారం కర్నూలు ఈగల్ సెల్ ఆధ్వర్యంలో డ్రగ్స్ నివారణపై అవగాహన సదస్సు నిర్వహించారు. ముందుగా ఈగల్ ఎస్ఐ సృజన్‌కుమార్ డ్రగ్స్ వినియోగం- వాటి పర్యవసనాలు తదితర అంశాలపై అవగాహన కల్పించారు. అనంతరం ఈవో శ్రీనివాసరావు, సీఐ ప్రసాద్‌రావు మాట్లాడుతూ డ్రగ్స్ సమస్య నేడు ఓప్రాంతానికో.. ఓరాష్ట్రానికో పరిమితమైన సమస్య కాదన్నారు. చాలా ప్రాంతాల్లో అనేకమంది డ్రగ్స్ వినియోగించి ప్రాణాలు పోగుట్టుకున్నారని గుర్తుచేశారు. ప్రతిఒక్కరూ బాధ్యతగా ఉండి డ్రగ్స్ రహిత సమాజమే లక్ష్యంగా మెలగాలన్నారు. యువకులు, విద్యార్థులు సైతం నడుం బిగించాలన్నారు. ఎవరైనా డ్రగ్స్ విక్రయాలు చేస్తే వారిపై చర్యలు తీసుకుంటామన్నారు.

నేడు మార్కెట్ యార్డు పాలకమండలి ప్రమాణ స్వీకారం

● చైర్మన్‌గా బాధ్యతలు చేపడుతున్న హరిబాబు



చైర్మన్ గుంటుపల్లి హరిబాబు

నంద్యాల ఎడ్యుకేషన్, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): నేడు టెక్కె మార్కెట్‌యార్డులో 17వ నంద్యాల మార్కెట్ యార్డు కమిటీ సభ్యుల ప్రమాణ స్వీకారోత్సవానికి ఏర్పాట్లు చేశారు. గౌరవ చైర్మన్‌గా రాష్ట్ర న్యాయ, మైనార్టీ సంక్షేమశాఖ మంత్రి ఎన్ఎండీ ఫరూక్, చైర్మన్‌గా గుంటుపల్లి హరిబాబు, వైస్ చైర్మన్‌గా దియ్యాల రంగప్రసాద్‌రావు, సభ్యులుగా భవనాశి ప్రమీలమ్మ, స్వామినాయక్, నంద్యాల విజయగౌరి, నాగలక్ష్మి, అనసూయమ్మ, లీలావతి, నాగమ్మ, మదార్‌సా, సుమలత, రవికుమార్, షేక్ నూర్‌బాష, షేక్అజ్మీర్, పీఏసీఎస్ కానాల చైర్మన్, నంద్యాల వ్యవసాయ అసిస్టెంట్ డైరెక్టర్, మున్సిపల్ చైర్మన్, జిల్లా అగ్రి ట్రేడ్ అండ్ మార్కెటింగ్ ఆఫీసర్లు సభ్యులుగా ప్రమాణ స్వీకారం చేయనున్నారు. ఈ కార్యక్రమానికి పెద్ద ఎత్తున టీడీపీ, కార్యకర్తలు, నాయకులు హాజరుకానున్నారు.

లారీని ఢీ కొన్న ఆర్టీసీ బస్సు

● అద్దాలు ధ్వంసం ● ప్రయాణికులకు స్వల్ప గాయాలు

వెల్దుర్తి, జూన్ 11(ఆంధ్రజ్యోతి): ముందు వెళ్తున్న లారీని ఏపీఎస్ఆర్టీసీకి చెందిన ఓబస్సు ఢీకొంది. ఈ ఘటన మండలంలోని మదార్‌పురంలో చోటుచేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. వివరాలు.. హిందూపూర్ డిపోకి చెందిన సూపర్ లగ్జరీ బస్సు హైదరాబాదు నుంచి హిందూపూర్‌కు వెళ్తుంది. అదేసమయంలో తెలంగాణకు చెందిన ఓ లారీ నారాయణపేట నుంచి తమిళనాడులోని తిరుచ్చికి లోడ్‌తో వెళుతోంది. మార్గమధ్యలో బుధవారం తెల్లవారుజామున మాదార్‌పురం గ్రామ సమీపాన హైవే-44లో ఒకే లేన్‌లో వెళ్తున్న లారీని సూపర్‌లగ్జరీ బస్సు ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో బస్సు అద్దాలు ధ్వంసం అయ్యాయి. బస్సులోని పలువురు ప్రయాణికులకు స్వల్ప గాయాలయ్యాయి. లారీకి ఎలాంటి నష్టం జరగలేదు. హైవే పెట్రోలింగ్ పోలీసులు అక్కడకు చేరుకొని ట్రాఫిక్ అంతరాయం కలగకుండా చర్యలు తీసుకున్నారు. క్షతగాత్రులను హైవే అంబులెన్స్‌లో వెల్దుర్తి పీహెచ్‌సీకి తరలించారు. ప్రాథమిక చికిత్స అనంతరం ప్రయాణికులను ఆర్టీసీకి చెందిన వేరే బస్సులో తరలించారు. కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

గుర్తుతెలియని వ్యక్తి ఆత్మహత్య

మంత్రాలయం, జూన్ 11(ఆంధ్రజ్యోతి): మంత్రాలయం మండలంలోని మాధవరం పోలీస్ స్టేషన్ పరిధిలో తుంగభద్ర రైల్వేస్టేషన్ ఎదురుగా అదాన్ విల్‌మర్ ఫ్యాక్టరీ వెనుకాల ముళ్ల కంప మధ్య గుర్తు తెలియని వ్యక్తి ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. బుధవారం మధ్యాహ్నం గొర్రెల కాపరులు చూసి ఫ్యాక్టరీ యాజమాన్యానికి సమాచారం ఇచ్చారు. పోలీసులకు సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. అతని వద్ద వివరాలు దొరకలేదు. మంగళవారం రాత్రి ఉరేసుకొని ఉండవచ్చని, మృతుడి వయస్సు 35 సంవత్సరాల లోపు ఉంటుందని పోలీసులు తెలిపారు. మృతుడు బూడిదరంగు జీన్స్, నశ్యం కలర్ టీషర్ట్ ధరించి ఉన్నాడని, తనవెంట తెచ్చుకున్న తెల్లని టవల్‌తో చెట్టుకు ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడని తెలిపారు. గుర్తుతెలియని మృతదేహంగా కేసు నమోదు చేసుకుని పోస్టుమార్టం నిమిత్తం ఎమ్మిగనూరు ప్రభుత్వాసుపత్రికి తరలించినట్లు మాధవరం ఎస్ఐ విజయకుమార్ తెలిపారు. కాచాపురం వీఆర్వో పుష్పలత ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన తెలిపారు.

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి

కోసిగి, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని ఐరంగల్, పెద్ద భోంపల్లి గ్రామాల మధ్యలో రైల్వే ట్రాక్ పక్కన కల్వర్టు వద్ద అనుమానాస్పద స్థితిలో కర్నూలులోని బుధవారపేటకు చెందిన జగ్గుల మద్దిలేటి (64) మృతిచెందాడు. మంగళవారం రాత్రి తుంగభద్ర రైల్వేస్టేష న్‌లో రైలు దిగి అక్కడి నుంచి పెద్దభోంపల్లి, ఐరంగల్ మధ్యలోని రైల్వేట్రా క్ పక్కనే ఉన్న కల్వర్టు పై నుంచి కిందకు పడటంతో అక్కడికక్కడే మృతి చెందాడని కోసిగి ఎస్ఐ హనుమంతరెడ్డి తెలిపారు. అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసుకొని పోస్టుమార్టం కోసం తరలించినట్లు తెలిపారు.

పుట్టాలమ్మ ఆలయంలో చోరీ

● 20 కేజీల వెండి అపహరణ

● సీసీ టీవీ పరికరాలు సైతం ఎత్తుకెళ్లిన దొంగలు



పుట్టాలమ్మ ఆలయం ఎదుట పోలీసుల విచారణ

ఆళ్లగడ్డ, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): . మండలంలోని పుట్టాలమ్మ క్షేత్రంలో మంగళవారం అర్ధరాత్రి చోరీ జరిగింది. అర్ధరాత్రి దొంగలు ఆలయ ప్రత్యేక దర్శన ద్వారం తలుపుల తాళాలను పగులగొట్టి గర్భగుడిలోకి ప్రవేశించారు. సుబ్రమణ్యేశ్వర స్వామి పుట్టపై అలంకరించిన నాగాభరణం, శఠగోపం తదితర వెండి వస్తువులను చోరీ చేశారు. సీసీ టీవీ ఫుటేజ్ కేబుల్ వైర్లను తీసి వేసి హర్డ్ డిస్క్‌ను కూడా తీసుకొని పోయారు. ఉదయం ఆలయానికి చేరుకొన్న పూజారి చోరీ జరిగినట్లు తెలుసుకొని పోలీసులకు సమాచారం అందించాడు. ఆళ్లగడ్డ రూరల్ సీఐ మురళీధర్‌రెడ్డి ఆలయానికి చేరుకొని పరిశీలించారు. జిల్లా కేంద్రం నుండి క్లూస్ టీం, డాగ్ స్క్వాడ్ బృందాలను రప్పించి గాలింపు చర్యలు చేపట్టారు. కేసు నమొదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు రూరల్ సీఐ మురళీధర్‌రెడ్డి తెలిపారు.

నంద్యాల

నంద్యాల, నందికొట్కూరు, శ్రీశైలం, పాణ్యం

కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

నందికొట్కూరు, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): మున్సిపాలిటీ ఇంజనీరింగ్ కార్మికుల సమస్యల పరిష్కారానికి 15న విధులను బహిష్కరించి సమ్మె చేయనున్నట్లు కార్మిక సంఘం నాయకులు సర్వర్‌ఖాన్, పరమేష్ తెలిపారు. బుధవారం తమ డిమాండ్ల సాధన కోసం 15న నీటి సరఫరా నిలుపుదల, విద్యుత్ కార్మికులు వీధి దీపాల నిర్వహణ మరియు పార్క్ నిర్వహణ మొదలైన పనులను నిలుపుతున్నట్లు సీపీఎం, మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మికుల సంఘం ఆధ్వర్యంలో మున్సిపల్ ఛైర్మన్ దాసి సుధాకర్‌రెడ్డి, కమీషనర్ బేబి, మున్సిపల్ ఛైర్మన్ దాసి సుధాకర్‌రెడ్డిలకు వినతిపత్రం సమర్పించారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు నాగేశ్వరరావు, గోపాలకృష్ణ తదితులు పాల్గొన్నారు.

టీడీపీ ఆధ్వర్యంలో ఉచిత కంటి పరీక్షలు

పాములపాడు, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని జూటూరు గ్రామంలో టీడీపీ నాయకులు హఫీజ్‌ఖాన్ ఆధ్వర్యంలో కర్నూలు సుశీల నేత్రాలయ వైద్యులు ఉచిత కంటి పరీక్షలు నిర్వహించారు. బుధవారం ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో 80 మందికి కంటి పరీక్షలు నిర్వహించగా ఇందులో 15 మందికి ఆపరేషన్లు అవసరమని వైద్యులు వెంకటాచలం, తులసికుమార్, నాగర్జునలు తెలిపారు. కార్యక్రమంలో గ్రామ నాయకులు రామక్రిష్ణారెడ్డి, టీడీపీ నాయకులు బాలీశ్వర్, ముర్తుజావలి, పూజల శివరాముడు పాల్గొన్నారు.

బాధ్యతలు చేపట్టిన వ్యవసాయశాఖ అధికారి

పాములపాడు, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): పాములపాడు మండల వ్యవసాయశాఖ అధికారిగా ఎన్. వెంకట మహేశ్వరరెడ్డి బుధవారం బాధ్యతలు చేపట్టారు. ఆయన మాట్లాడుతూ తాను ఎమ్మిగనూరు నుంచి బదిలీపై వచ్చాను అన్నారు. పాములపాడులో ఏవోగా విధులు నిర్వహిస్తున్న ఫణీశ్వరరెడ్డి నందికొట్కూర్‌కు బదిలీ అయ్యారు. దీంతో ఇరువురికి మండల ఎరువుల దుకాణ యజమానులు పూలదండలు, శాలువాలు కప్పి సత్కరించారు.

కబడ్డీ విజేత మిట్టకందాల జట్టు

పాములపాడు, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రుద్రవరం గ్రామంలో రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలలో మొదటి బహుమతి రూ. 15 వేలు మిట్టకందాల జట్టుకు నంద్యాల సీఐ సుదాకర రెడ్డి అందించారు. రెండో బహుమతి 10 వేల రూపాయలను నెహ్రూ నగర్ జట్టు, మూడో బహుమతి 5వేలు రుద్రవరం జట్టు, నాల్గవ బహుమతిని వేల్పనూరు జట్టుకు 3వేల రూపాయలు, ఐదో బహుమతి రెండువేలు రుద్రవరం టెంపుల్‌యూత్‌లు కైవసం చేసుకున్నాయి. ఈ కార్యక్రమంలో సర్పంచ్ రామస్వామి, రామసుబ్బయ్య, శవికుమార్‌యాదవ్, బుడ్డన్నగౌడ్, లక్ష్మణ్‌గౌడ్, శ్రీకాంత్‌యాదవ్, శంకర్‌గౌడ్, రవికుమార్ యాదవ్, రామాం.నేయులు, హర్షవర్ధన్, అంకన్న పాల్గొన్నారు.

ఆలయ భూములకు వేలం పాటలు

నంద్యాల కల్చరల్, జూన్ 11(ఆంధ్రజ్యోతి): నంద్యాల మూలమఠంలో వెలసిన భీమలింగేశ్వరస్వామి దేవస్థానానికి చెందిన 4.04 ఎకరాలకు బుధవారం ఆలయ కార్యనిర్వహణాధికారి వేణునాథరెడ్డి, కోవెలకుంట్ల దేవస్థానముల కార్యనిర్వహణాధికారి బాలచెంచన్న సంయుక్త పర్యవేక్షణలో వేలం పాటల నిర్వహించారు. మూడు సంవత్సరాలకు గాను బహిరంగ వేలం ద్వారా రూ.1,10,000కు ముగ్గురు రైతులు కౌలుకు దక్కించుకున్నట్లు ఈవో వేణునాథరెడ్డి తెలిపారు.

మహిళలు ఆర్థికంగా ఎదగాలి

నంద్యాల హాస్పటల్, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): మహిళలు ఆర్థికంగా ఎదగాలని డా.మధుసూదన్‌రావు అన్నారు. బుధవారం శ్రీరామకృష్ణ డిగ్రీ, పీజీ కళాశాలలో జరుగుతున్న 9వ ఆంధ్ర బాలికల బెటాలియన్ శిక్షణా శిబిరంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మహిళలు సాధికారిత అనే అంశంపై ప్రసంగించారు. మహిళలు గొప్ప లక్ష్యంతో ముం దుకుసాగాలని, ఉన్నత విద్యను తప్పనిసరిగా అభ్యసించాలని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో క్యాంప్ అసిస్టెంట్ కమాండెంట్ లెఫ్టినెంట్ కమాండెంట్ శ్రీప్రియ, ఎన్‌సీసీ ఆఫీసర్లు, ఎన్‌సీసీ కేడెట్లు పాల్గొన్నారు.

16న జరిగే ధర్నాను జయప్రదం చేయండి



మాట్లాడుతున్న సీపీఎం నాయకులు

ఆత్మకూరు, జూన్ 11(ఆంధ్రజ్యోతి): అర్హులైన పేదలందరికీ ఇళ్ల స్థలాలను పంపిణీ చేయాలని సీపీఎం నాయకులు ఏసురత్నం, రణధీర్ డిమాండ్ చేశారు. బుధవారం స్థానిక ఆ పార్టీ వారు మాట్లాడుతూ 16న చేపటే ర్యాలీని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో ఆ పార్టీ నాయకులు రామ్‌నాయక్, నాగేశ్వరరావు, వీరన్న, గణపతి, శ్రీను, మద్దిలేటి ఉన్నారు.

ఆర్టీసీ బస్ పాసుల జారీలో అంతరాయం

ఆత్మకూరు, జూన్ 11(ఆంధ్రజ్యోతి): ఆత్మకూరు ఆర్టీసీ డిపో పరిధిలో రెండు రోజుల పాటు బస్సు పాసుల జారీలో అంతరాయం ఉంటుందని డిపో మేనేజర్ వినయ్‌కుమార్ బుధవారం తెలిపారు. ఆయన మాట్లాడుతూ ఆర్టీసీ బస్సు పాస్‌లు చేసే సాఫ్ట్‌వేర్ ఆధునీకరణలో భాగంగా 12, 13 తేదీల్లో బస్సు పాస్ కౌంటర్లను మూసివేయనున్నట్లు చెప్పారు. 14వ తేదీ నుంచి యథావిధి గా బస్సు పాసులను జారీ చేయనున్నట్లు తెలిపారు. ఈ విషయా న్ని ఆర్టీసీ ప్రయాణికులు, విద్యార్థులు గమనించుకోవాలని సూచించారు.

ఏడు రహదార్లకు రూ.10.89 కోట్లు

శంకుస్థాపన చేసిన న్యాయ, మైనార్టీ శాఖ మంత్రి ఎన్ఎండీ ఫరూక్

నంద్యాల హాస్పటల్, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో వివిధ పథకాల కింద నిర్మించనున్న ఏడు రహదార్లకు రూ.10.89 కోట్లు మంజూరయ్యాయని న్యాయ, మైనార్టీ శాఖ మంత్రి ఎన్ఎండీ ఫరూక్ అన్నారు. బుధవారం నంద్యాలలోని సంజీవనగర్ గేట్‌వద్ద రహదారి నిర్మాణానికి ఆయన శంకుస్థాపన చేశారు. సంజీవనగర్ నుంచి శ్రీనివాస సెంటర్ వరకు రూ.4.5కోట్లతో సీసీ రోడ్డు నిర్మించనున్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ జిల్లాలో పెద్దఎత్తున రహదార్ల నిర్మాణానికి అనుమతులు లభించాయని అన్నారు. ఇందుకు రోడ్లు భవనాల శాఖ మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి కృషి చేశారని అన్నారు. కలెక్టర్ రాజకుమారి మాట్లాడుతూ జిల్లాలో వివిధ ఇంజనీరింగ్ శాఖలకు సంబంధించి 968 పనులకుగాను రూ.102.62 కోట్లతో ప్రారంభించామన్నారు. 198 పనులకు గాను 206.14కోట్లకు సంబంధించి శంకుస్థాపనలు చేశామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్‌అండ్‌బీ ఈఈ శ్రీధర్‌రెడ్డి, అదనపు మున్సిపల్ కమిషనర్ వెంకటదాస్, టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్ఎండీ ఫిరోజ్, కౌన్సిలర్లు శ్యాంసుందర్‌లాల్, చెరుకు శ్రీదేవి, టీడీపీ నాయకులు గోవిందనాయుడు తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు మంత్రి భూమి పూజ

నంద్యాల రూరల్: నంద్యాల మండలం రాయమాల్పురం గ్రామంలో నూతనంగా ఏర్పాటు చేయనున్న సీసీ రోడ్డు నిర్మాణానికి మంత్రి ఎన్ఎండీ ఫరూక్ భూమిపూజ చేశారు. బుధవారం కోటి రూపాయలతో రాయమాల్పురం, పోలూరు గ్రామాల మధ్య ఏర్పాటు చేయనున్న లింక్ రోడ్డుకు శ్రీకారం చుట్టారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ మునగాల విశ్వనాథరెడ్డి, రాయమాల్పురం కాశన్న, చంద్రశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.



పైలాన్‌ను ప్రారంభిస్తున్న మంత్రి ఫరూక్, కలెక్టర్ రాజకుమారి

రైతులకు డ్రోన్స్ పంపిణీ.. రాయమాల్పురం గ్రామంలో వ్యవసాయ యాంత్రీకరణ పథకంలో భాగంగా 80 శాతం సబ్సిడీతో ప్రభుత్వం అందజేస్తున్న డ్రోన్స్‌లను మంత్రి ఫరూక్ రైతులకు అందజేశారు. రాయమాల్పురం చాపిరేవుల గ్రామాలకు చెందిన రైతుమిత్ర గ్రూప్ సభ్యులకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి ప్రసాదరావ్, తహసీల్దార్ శ్రీనివాసులు, ఎంపిడీవో సుగుణశ్రీ, ఈవోఆర్డీ జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం: ఎమ్మెల్యే

పాణ్యం, జూన్ 11 (ఆంధ్రజ్యోతి) : రైతుల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే గౌరు చరిత, నందికొట్కూరు టీడీపీ ఇంచార్జి గౌరు వెంకటరెడ్డి అన్నారు. పాణ్యం వ్యవసాయ మార్కెట్‌యార్డు కమిటీ సభ్యుల ప్రమాణ స్వీకారోత్సవం బుధవారం ఘనంగా జరిగింది. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ రైతుల సమస్యలపై కమిటీ సభ్యులు స్పందించాలని కోరారు. యార్డు అభివృద్ధికి సభ్యులు కృషి చేయాలన్నారు. యార్డు ఛైర్మన్‌గా అంగజాల గీత, ఉపాధ్యక్షుడిగా యేలంపల్లి గోవర్ధన్‌రెడ్డి, సభ్యులుగా లక్ష్మీప్రసన్న, ఉషారాణి, వెంకటరమణారెడ్డి, ఈశ్వరమ్మ, ప్రభావతమ్మ, రాజునాయక్, షణ్ముఖరెడ్డి, సుధాకర్, పద్మలీల, సంగటి ప్రభాకర్, రామచంద్రారెడ్డి, జ.యమ్మ, రవకుమార్‌లు ప్రమాణ స్వీకారం చేశారు. కార్యక్రమంలో గడివేముల పీఏసీఎస్ ఛైర్మన్, వ్యవసాయ శాఖ ఏడి, జిల్లా అగ్రిటెక్ మార్కెటింగ్ అధికారి, టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

సర్పంచ్‌కు అందని ఆహ్వానం : పాణ్యం మేజర్ గ్రామ పంచాయతీ సర్పంచ్ వ్యవసాయ మార్కెట్ కమిటీ యార్డు సభ్యురాలు పల్లవిని ప్రమాణ స్వీకారానికి ఆహ్వానించకపోవడంపై స్థానిక గ్రామ ప్రజలు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. జడ్పీటీసీ, ఎంపీపీలను ఈ కార్యక్రమానికి ఆహ్వానించకపోవడంపై తీవ్ర విమర్శలు వ్యక్తమవుతున్నాయి, ప్రోటోకాల్ పాటించని యార్డు అధికారులపై అసహనం వ్యక్తం చేశారు.



ప్రమాణ స్వీకారం చేస్తున్న కమిటీ సభ్యులు

మహిళలకు క్షమాపణ చెప్పాలి



కొమ్మినేని, కృష్ణంరాజు చిత్రాలను దహనం చేస్తున్న మహిళలు

నంద్యాల రూరల్, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి జగన్ సతీమణి భారతి భారతి మౌనం వీడి అమరావతి మహిళలకు క్షమాపణ చెప్పాలని టీడీపీ మహిళా విభాగపు జిల్లా అధ్యక్షురాలు విజయగౌరి డిమాండ్ చేశారు. బుధవారం టీడీపీ కార్యాలయం నుంచి గాంధీచౌక్ వరకు మహిళల భారీ ర్యాలీ చేపట్టారు. ఆమె మాట్లాడుతూ అమరావతి మహిళలను కించపరచే విధంగా మహిళల ఆత్మగౌరవం దెబ్బతినేలా మాట్లాడిన వైసీపీ నాయకుడు కృష్ణంరాజు, సాక్షి రిపోర్టర్ కొమ్మినేని శ్రీనివాసరావ్‌ను కఠినంగా శిక్షించాలని నినాదాలు చేశారు. మహిళల జోలికి వస్తే వైసీపీకి పుట్టగతులుండవంటూ హెచ్చరించారు. కార్యక్రమంలో జ్యోతి రాయల్, కౌన్సిలర్ శ్రీదేవి, భారతి, పద్మావతి, నాగరత్నమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఎంఈవోగా బాధ్యతల స్వీకరణ

గడివేముల, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): పాణ్యం ఎంఈవో కోటయ్య గడివేముల ఎంఈవో-1గా బుధవారం అదనపు బాధ్యతలను స్వీకరించారు. గడివేముల ఎంఈవో-1 అదనపు బాధ్యతలు నిర్వహిస్తున్న మేరి సునీత బదిలీ కావడంతో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఎంఈవో-1గా కోటయ్య బాధ్యతలు స్వీకరించారు. విద్యాభివృద్ధికి కృషి చేస్తానని ఆయన అన్నారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించేలా చర్యలు తీసుకుంటామని అన్నారు.

వృద్ధాశ్రమానికి విరాళం

నంద్యాల రూరల్, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): నంద్యాల సమీపాన రైతునగరంలో గోరంట్ల చిన్న రంగమ్మ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వృద్ధాశ్రమానికి ఎన్జీవోస్ కాలనీకి చెందిన శ్రీ గురురాజ ఇంగ్లీష్ మీడియం పాఠశాల డైరెక్టర్ పెద్దిరెడ్డి షేక్షావలిరెడ్డి కుర్చీలను విరాళంగా అందజేశారు. బుధవారం షేక్షావలి పుట్టిన రోజును పురస్కరించుకుని రూ.15 వేలు విలువచేసే కుర్చీలను అందజేశారు.

చెత్తతో నీటి ప్రవాహానికి అంతరాయం

పాణ్యం, జూన్ 11 (ఆంధ్రజ్యోతి) : వాగుల్లో చెత్త వేయడంవల్ల నీటిప్రవాహానికి అంతరాయమేర్పడుతుందని ఎస్సార్బీసీ డీఈ పద్మనాభరెడ్డి పేర్కొన్నారు. బుధవారం స్థానిక జుర్రాగు వద్ద నిల్వ ఉన్న చెత్తను పరిశీలించారు. ఎస్సార్బీసీ కాల్వకు నీరు వదిలే సమయంలో వాగుకు నీరు ఎక్కువగా వచ్చి చెత్తతో నీరు ప్రవాహం తగ్గి సమీప పంటపొలాల్లోకి, వాగు వంతెనల పైకి చేరుతుందన్నారు. గ్రామంలోని చెత్తను ప్రత్యేక స్థలంలో వేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో డీఈ సుబ్బారావు, సిబ్బంది పాల్గొన్నారు.

పనుల్లో నాణ్యత లోపించింది

నందికొట్కూరు, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): హంద్రీనీవా సృజల స్రవంతి కాలువ విస్తరణ పనుల్లో నాణ్యత లోపించిందని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు నాగేశ్వరరావు ఆరోపించారు. అధికారుల పర్యవేక్షణ లేని హంద్రీనీవా విస్తరణ పనులను ఉన్నతస్థాయి కమిటీ విచారణ చేపట్టాలని ఆయను డిమాండ్ చేశారు. బుధవారం నందికొట్కూరు మండలం మల్యాల గ్రామం వద్ద ఉన్న హంద్రీనీవా విస్తరణ పనులను సీపీఎం జిల్లా కార్యదరిశె సభ్యులు నాగేశ్వరరావు, సీపీఎం నాయకులు పక్కీర్ సాహెబ్, గోపాలకృష్ణ తదితరులు కలిసి పనులను పరిశీలించారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు గోపాలకృష్ణ, పక్కీర్‌సాహెబ్ తదితరులు పాల్గొన్నారు.

గ్రామీణ రోడ్లకు మహర్దశ: ఎమ్మెల్యే

నందికొట్కూరు రూరల్, జూన్ 11 (ఆంధ్రజ్యోతి) : కూటమి ప్రభుత్వంలో గ్రామీణ ప్రాంతం రోడ్లకు మహర్దశ వచ్చిందని ఎమ్మెల్యే జయసూర్య, నంద్యాల లోక్‌సభ టీడీపీ ఇన్‌చార్జ్ మాండ్ర శివానందరెడ్డి అన్నారు. బుధవారం నందికొట్కూరు మండలంలోని అల్లూరు గ్రామంలో ఎమ్మెల్యే జయసూర్య, మాండ్ర శివానందరెడ్డి రోడ్ల నిర్మాణం కోసం భూమి పూజ నిర్వహించి శంకుస్థాపన చేశారు. రూ 5 కోట్ల నాబార్డు నుంచి వచ్చే నిధులతో ఈ రోడ్ల నిర్మాణం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు మాండ్ర సురేంద్రనాథ రెడ్డి, గ్రామ సర్పంచ్ చిన్న నాగలక్ష్మయ్య, రవీంద్ర నాయడు, శ్రీనివాసులు అధికారులు పాల్గొన్నారు.

పగిడ్యాల: ఏడాదిలోనే నియోజకవర్గానికి రూ. 16కోట్లతో సీసీ రోడ్డు నిర్మాణం పనులు చేపట్టామని ఎమ్మెల్యే గిత్తా జయసూర్య అన్నారు. పల్లె పండుగ కార్యక్రమంలో భాగంగా పడమర ప్రాతకోట గ్రామంలో రూ. కోటితో నిర్మించిన సీసీ రోడ్డు నిర్మాణం పనులను ఎమ్మెల్యే బుధవారం ప్రారంభించారు. కార్యక్రమంలో నందికొట్కూరు మార్కెట్ యార్డు ఛైర్మన్ వీరం ప్రసాదరెడ్డి, పరమేశ్వరరెడ్డి, టీడీపీ నాయకులు పలుచాని మహేశ్వరరెడ్డి, లోకానంద రెడ్డి, దామోదర్‌రెడ్డి, రాజశేఖర్‌రెడ్డి, పంచాయతీ రాజ్ డీఈ ధ్వనిబాబు, తహసీల్దార్ శివరాముడు, ఎంపీడీవో సుమిత్రమ్మ, గ్రామ నాయకులు వెంకటొరెడ్డి, నాగశేషులు, బాలీశ్వర్‌గౌడ్, వెంకటేశ్వర్లు, రమణ, కర్ణ, దత్తు ఉన్నారు.

పాములపాడు: మండలంలోని క్రిష్ణరావుపేట నుంచి తుమ్మలూరు గ్రామం వరకు రూ. 35.50 లక్షలతో నిర్మిస్తున్న బీటీరోడ్డుకు ఎమ్మెల్యే గిత్తా జయసూర్య బుధవారం భూమిపూజ నిర్వహించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు మండల కన్వీనర్ రవీంద్రరెడ్డి, తిమ్మారెడ్డి, హ రినాధరెడ్డి, వెంకటేశ్వరరెడ్డి, సత్యంరెడ్డి, ఏసేపు, అలీబాషా, రామక్రిష్ణ, జనార్దన్, చంద్రశేఖర్, గోవిందు, పూస లక్రిష్ణ, లింగేశ్‌గౌడ్, ఆదిరెడ్డి పాల్గొన్నారు.

జూపాడుబంగ్లా: రాష్ట్రాభివృద్ధి జరగాలంటే ఒక్క టీడీపీతోనే సాధ్యమని నందికొట్కూరు ఎమ్మెల్యే జయసూర్య అన్నారు. బుధవారం మండల కేంద్రం జూపాడుబంగ్లాలోని కస్తూర్బా బాలికలకు అదనంగా గదులనిర్మాణం, డార్మెంటరీ గదుల నిర్మాణానికి ఎమ్మెల్యే ముఖ్యఅతిథులుగా పాల్గొని శంకుస్థాపనతోపాటు పనులకు భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రూ. 2.55కోట్లతో చేపట్టే ఈ పనులను త్వరితగ తిన పూర్తిచేసి విద్యార్థినులకు సౌకర్యం కల్పించాలని అధికారులకు ఆదేశించారు. కార్యక్రమంలో రాష్ట్రయాదవకార్పొరేషన్ డైరెక్టర్ వెంకటేశ్వర్లుయాదవ్, మార్కెట్‌యార్డు ఛైర్మన్ ప్రసాదరెడ్డి, టీడీపీ మండల నాయకులు గిరీశ్వరరెడ్డి, మోహన్‌రెడ్డి, రమణారెడ్డి, జంగాలపెద్దన్న, రవికాంత్, రవికుమార్‌యాదవ్, రాముడు, ఎంపీడీవో గోపికృష్ణ, తహసీల్దార్ చంద్రశేఖర్‌నాయక్, ఎంఈవో చిన్నమద్దిలేటి, ఆర్‌డబ్ల్యూఎస్‌ఏఈ నాగేంద్ర, పీఆర్‌ఏఈ బషీర్, కస్తూర్బా పాఠశాల ఎస్‌ఓ యశోద, ఉపతహసీల్దార్ నాగన్న పాల్గొన్నారు.



అల్లూరులో రోడ్ల నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే జయసూర్య, మాండ్ర శివానందరెడ్డి



పగిడ్యాలలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

మత్స్య సంపద అభివృద్ధికి కృషి చేయండి: కలెక్టర్



అధికారులతో సమీక్షిస్తున్న కలెక్టర్ రాజకుమారి

నంద్యాల నూనెపల్లె, జూన్ 11 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో ప్రధాన మంత్రి మత్స్య సంపద యోజన పథకాన్ని పటిష్టంగా అమలుపరుస్తూ మత్స్య సంపద అభివృద్ధికి కృషి చేయాలని కలెక్టర్ రాజకుమారి అన్నారు. బుధవారం కలెక్టర్ చాంబర్‌లో ప్రధానమంత్రి మత్స్య సంపద అమలుపై జిల్లా స్థాయి కమిటీ సభ్యులతో కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. మైనర్ ఇరిగేషన్ ట్యాంక్‌లు, రిజర్వాయర్లలో చేపల ఉత్పత్తికి పటిష్ట చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. చేప పిల్లల ఉత్పత్తిని స్థానికంగా పెంచడంతో రైతులు, మత్స్యకారులకు ప్రత్యక్ష లాభం చేకూరుతుందని గ్రామీణ ప్రాంతాల ఆర్థిక స్థితి మెరుగుపడి స్వర్ణాంధ్ర ప్రగతికి దోహదపడుతుందన్నారు. చేప పిల్లల కొరతను దృష్టిలో పెట్టుకొని నంద్యాల ప్రభుత్వ మత్స్యక్షేత్రాన్ని ఆర్ఐడీఎఫ్ పథకం కింద అభివృద్ధి చేయాలని, అలాగే 7.5ఎకరాల తంగడంచె మత్స్య క్షేత్రాన్ని మరింత విస్తరింపజేయాలని సూచించారు. సమావేశంలో జిల్లా మత్స్యసంపద అధికారి రాఘవరెడ్డి, అధికారులు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

నాణ్యమైన భోజనం అందించాలి

మహానంది, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): పాఠశాల్లో విద్యార్థులకు ప్రధానోపాధ్యాయులు నాణ్యమైన భోజనం అందించాలని డిప్యూటీ డైరెక్టర్ ఏపీ మోడల్‌స్కూల్స్, స్టేట్ నోడల్ ఆఫీసర్ రవిసాగర్ తెలిపారు బుధవారం మహానంది మండలం గాజులపల్లి, తిమ్మాపురం జడ్పీ పాఠశాలల్లోని రాధాకృష్ణ విద్యార్థి స్టాక్ పాయింట్లను ఆయన పరిశీలించారు. గురువారం పాఠశాలలు ప్రారంభం కానున్నాయి. కార్యక్రమంలో నంద్యాల జిల్లా సర్వశిక్ష ఇన్‌చార్జి ఆఫీసర్ శరత్‌బాబు, మండల విద్యాశాఖాధికారి రామసుబ్బయ్య, సీఆర్పీలు పాల్గొన్నారు.

బీజేపీతోనే దేశాభివృద్ధి



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే కాపు రామచంద్రారెడ్డి

నంద్యాల కల్చరల్, జూన్ 11(ఆంధ్రజ్యోతి): బీజేపీతోనే దేశాభివృద్ధి సాధ్యమని మాజీ ఎమ్మెల్యే కాపు రామచంద్రారెడ్డి, నంద్యాల జిల్లా బీజేపీ అధ్యక్షుడు అభిరుచి మధు అన్నారు. మోదీ ప్రభుత్వం 11ఏళ్లను పురస్కరించుకున్న సందర్భంగా నంద్యాలలో బుధవారం సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో డాక్టర్ వినీషారెడ్డి, రాష్ట్ర కౌన్సిల్ మెంబర్ మేడా మురళీధర్, డా. ఇంటి ఆదినారాయణ పాల్గొన్నారు. అనంతరం వారు మాట్లాడుతూ వికసిత భారతదేశానికి ప్రధాని మోదీ పాలన అమృతకాలంగా నిలిచిందన్నారు. అనేక సంక్షేమ పథకాలతో దేశంలో పేదరిక నిర్మూలనకు ప్రధాని మోదీ ఎంతగానో కృషి చేశారని కొనియాడారు. భారత ఆర్థిక వ్యవస్థను ప్రపంచంలోనే నాల్గో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దడం మామూలు విషయం కాదన్నారు. ప్రధానీ మోదీ పాలనలో భారత్ ముమ్ముందు మరెన్నో విజయాలను సొంతం చేసుకోనుందని వెల్లడించారు.

రైతులు శాస్త్రవేత్తల సలహాలు పాటించాలి

కొత్తపల్లి, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): రైతులు ఎప్పుడైతే వ్యవసాయ శాస్త్రవేత్తల సలహాలు, సూచనలు పాటిస్తారో.. వాటి మెలకువలు తెలుసుకొని పంటల్లో అధిక దిగుబడులు సాధించవచ్చని వ్యవసాయ శాస్త్రవేత్త రమణయ్య సూచించారు. బుధవారం వికసిత్ కృషి సంకల్ప అభియాన్ కార్యక్రమంలో భాగంగా మండలంలోని దుద్యాల గ్రామంలో వ్యవసాయాధికారులు, సిబ్బంది, రైతులతో కలిసి ఆయన సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ రసాయన ఎరువుల కన్నా సేంద్రియ ఎరువులు ఉపయోగించడం వలన నేల ఆరోగ్యాన్ని కాపాడినవారు అవుతారన్నారు. పంట అవశేషాలు కాల్చి వేయకుండా కల్లించి వేయడం వల్ల భూమిలో సేంద్రియ కర్బనం పెరుగుతుందని వివరించారు. కార్యక్రమంలో మండల ఉద్యాన అధికారి చందన, ఉప సర్పంచ్ మన్సూర్ బాషా, వ్యవసాయ విస్తరణ అధికారి నాగశ్రీ, వ్యవసాయ సహాయకులు శేషు, వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

శిల్పా చక్రపాణిరెడ్డి జైలుకు వెళ్లడం ఖాయం

- శ్రీశైలం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖరరెడ్డి

ఆత్మకూరు, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): మాజీ ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి చేసిన అవినీతి చిట్టా త్వరలోనే బయటపడుతోందని, సాక్ష్యాధారాలతో ఆయనను జైలుకు పంపించడం ఖాయమని ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖరరెడ్డి హెచ్చరించారు. బుధవారం కూటమి ప్రభుత్వం ఏడాది పాలనను పురస్కరించుకుని స్థానిక టీడీపీ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ వైసీపీ పాలనలో రాష్ట్రం సర్వనాశనమైందని ఈ పరిస్థితుల్లో రాష్ట్రాన్ని గాడిన పెట్టేందుకు సీఎం చంద్రబాబు, డిప్యూటీ పవన్ కళ్యాణ్ ఎంతగానో కృషి చేస్తున్నారని అన్నారు. నియోజకవర్గంలోనే 396 పనులకు సంబంధించి రూ.150కోట్లతో అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు వివరించారు. అభివృద్ధి చేస్తుంటే వైసీపీ నాయకులు జూన్ 4న వెన్నుపోటు దినం అని జరుపుకోవడం విడ్డూరంగా ఉందన్నారు. పైగా ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే శిల్పా తన హయంలో ఏమి అభివృద్ధి చెప్పకుండా తనపై తప్పుడు ఆరోపణలు చేశారని మండిపడ్డారు. సమావేశంలో శ్రీశైలం ట్రస్టుబోర్డు మాజీ ఛైర్మన్ వంగాల శివరామిరెడ్డి, మాజీ మార్కె ట్ యార్డు ఛైర్మన్ తిరుపమయ్య, టీడీపీ మండల, పట్టణాధ్యక్షులు రవీంద్రబాబు, వేణుగోపాల్, మండల మాజీ మండలాధ్యక్షులు శివప్రసాద్‌రెడ్డి, పట్టణ ప్రధాన కార్యదర్శి అబ్దుల్లాపురం బాషా ఉన్నారు.

● ఆత్మకూరు పట్టణంలోని పలు అభివృద్ధి పనులకు బుధవారం శ్రీశైలం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖరరెడ్డి భూమిపూజ చేశారు. 15వ ఆర్థిక సంఘం నిధుల నుంచి ఈ పనులు చేపడుతున్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ రత్నరాధిక, మున్సిపల్ కమిషనర్ రమేష్‌బాబు, శ్రీశైలం ట్రస్టుబోర్డు మాజీ ఛైర్మన్ వంగాల శివరామిరెడ్డి, మున్సిపల్ ఛైర్మన్ డాక్టర్ మారూఫ్ ఆసియా, కోఆప్షన్ సభ్యులు ఎంఏ.రషీద్ తదితరులు ఉన్నారు.

రహదారుల అభివృద్ధి టీడీపీతోనే సాధ్యం

బండిఆత్మకూరు: గ్రామాల్లో రహదారుల అభివృద్ధి టీడీపీ ప్రభుత్వానికే సాధ్యమని ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్‌రెడ్డి అన్నారు. బుధవారం బండిఆత్మకూరు నుంచి ఎర్రగుంట్ల వరకు నిర్మించిన రూ.3.71 కోట్ల బీటీ రోడ్డును, స్టేషన్ సర్కిల్ నుంచి సంత మార్కెట్ వరకు రూ.33 లక్షలతో నిర్మించిన సీసీ రోడ్డును ప్రారంభించారు. కార్యక్రమంలో కేసీ కెనాల్ ఛైర్మన్ రామలింగారెడ్డి, టీడీపీ వైస్ ఛైర్మన్ మనోహర్‌చౌదరి, మండల టీడీపీ అధ్యక్షుడు కృష్ణారెడ్డి, సుబ్బారెడ్డి, నరసింహారెడ్డి, బుగ్గరాముడు పాల్గొన్నారు.



ఆత్మకూరులో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే బుడ్డా



నేలకొరిగిన అరటితోటలను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే

మహానంది: కూటమి ప్రభుత్వంతోనే గ్రామాల అభివృద్ధి సాధ్యమని ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్‌రెడ్డి అన్నారు. బుధవారం మహానంది మండలంలో ఇటీవల వీచిన భారీ ఈదురుగాలులకు నేలకూలిన అరటి తోటలను ఎమ్మెల్యే పరిశీలించారు. దెబ్బతిన్న తోటల రైతులకు ఆదుకుంటామని చెప్పారు. అనంతరం అబ్బీపురంలో జలజీవన్ మిషన్ క్రింద రూ. 65.10 లక్షలతో నిర్మించిన రక్షిత మంచినీటి ట్యాంక్‌ను ఎమ్మెల్యే ప్రారంభించారు. గ్రామ సర్పంచ్ శ్రీ లక్ష్మి, ఎంపీపీ యశస్విని, తహసీల్దార్ రమాదేవి, ఎంపీడీవో మహమ్మద్ దౌలా, కేసీ కెనాల్ అధ్యక్షుడు బన్నూరి రామలింగారెడ్డి,మాజీ ఎంపీటీసీ దస్తగిరి, మండల టీడీపీ కార్యదర్శి కంచెర్ల శివశంకర్, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

వెలుగోడు: టీడీపీతోనే రాష్ట్రావృద్ధి సాధ్యమని ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్‌రెడ్డి అన్నారు. బుధవారం ఆయన రేగడగూడూరు సమీపంలో బీటీ రోడ్డు నిర్మాణానికి, వెలుగోడు వేల్పనూరు రహదారిలో మంచినీల్ల వాగుపై వంతెన నిర్మాణానికి ఆయన భూమిపూజ చేశారు. కార్యక్రమాలలో టీడీపీ నాయకులు అబ్దుల్‌కలాం, రసూ ల్, ఖలీల్, ఎల్లాల క్రిష్ణుడు, వీరభద్రుడు, క్రిష్ణారెడ్డి పాల్గొన్నారు.

హిందూ సంప్రదాయాన్ని కాపాడాలి

చాగలమర్రి, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో హిందూ సంప్రదాయాన్ని ప్రతి హిందువు కాపాడాలని సమరసతా సేవా ఫౌండేషన్ రాయలసీమ కన్వీనర్ ఈశ్వర్‌రెడ్డి తెలిపారు. బుధవారం చాగలమర్రి కన్యకాపరమేశ్వరి ఆలయంలో ఎస్ఎస్ఎఫ్ సభ్యుల సమావేశం రాష్ట్ర సహ కన్వీనర్ ఎం.సాయిరామ్ అధ్యక్షతన నిర్వహించారు. కార్యక్రమంలో పీఠాధిపతి అభినవ శంకరానందస్వామి, జిల్లా సహకన్వీనర్ సల్లా నాగరాజు, టీఎస్‌టీయూసీ రాష్ట్ర కార్యదర్శి గుత్తి నరసింహులు, మండల కన్వీనర్లు వీరంరెడ్డి భాస్కర్‌రెడ్డి, లక్ష్మీదేవి, ఎస్ఎస్ఎఫ్ సభ్యులు, హిందూ సంఘ నాయకులు పాల్గొన్నారు.

ఘనంగా పెద్దమ్మ జాతర

- బీసీ ఇందిరమ్మ ప్రత్యేక పూజలు


పూజల్లో పాల్గొన్న బీసీ ఇందిరమ్మ

బనగానపల్లె, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని యాగంటిపల్లె గ్రామంలో పెద్దమ్మ జాతర అంగరంగ వైభవంగా జరిగింది. 40ఏళ్ల క్రితం పెద్దమ్మ జాతర నిర్వహించారు. 40ఏళ్ల తర్వాత నిర్వహించిన ఈ జాతరకు వేలాదిగా ప్రజలు తరలి వచ్చారు. టీడీపీ నాయకురాలు బీసీ ఇందిరమ్మ పెద్దమ్మతల్లి వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు. సంప్రదాయం ప్రకారం గ్రామ నడిబొడ్డున పెద్దమ్మ తల్లి విగ్రహాన్ని తయారు చేసి ప్రతిష్ఠించారు. వేలాది మంది భక్తులు అమ్మవారికి పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. బనగానపల్లె సీఐలు ప్రవీణ్‌కుమార్, మంజునాథరెడ్డి, ఎస్ఐ దుగ్గిరెడ్డి, పోలీస్ సిబ్బంది బందోబస్తు నిర్వహించారు. టీడీపీ నాయకులు మౌళీశ్వర్‌రెడ్డి, గ్రామ రైతు సంఘం నాయకులు, బీసీ ఇందిరమ్మకు స్వాగతం పలికారు. పలు ఇళ్లకు వెళ్లి బీసీ ఇందిరమ్మ వారి కుటుంబసభ్యులను పలకరించారు.

బండలాగుడులో విజేతగా అల్లూరి వృషభాలు

దొర్నిపాడు, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని డబ్ల్యూ.గోవిందిన్నె గ్రామంలో వెలసిన మూలపెద్దమ్మ దేవర సందర్భంగా బుధవారం ఎద్దుల బండలాగుడు పోటీలను నిర్వహించారు. ఈ పోటీల్లో ఉయ్యాలవాడ మండలం అల్లూరి గ్రామానికి చెందిన అరికట్ల శివారెడ్డికి చెందిన వృషభాలు మొదటి స్థానంలో నిలిచాయి. గెలుపొందిన వృషభాల యజమానికి రూ.లక్ష అందజేశారు. అలాగే వరుస విజేతలకు బహుమతులు ఇచ్చారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

చింతలచెరువులో ఆలయ భూముల వేలం

చాగలమర్రి, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చింతలచెరువు గ్రామంలో ఆత్మకూరు ఈవో కార్తీక్ ఆధ్వర్యంలో బుధవారం ఆలయాల భూములకు వేలం నిర్వహించారు. గతంలో కంటే ఈ ఏడాది రూ.3.56 లక్షలు ఆదాయం పెరిగిందని అన్నారు. కార్యక్రమంలో ఎస్ఐ సురేష్‌నాయుడు, పోలీసులు ఉన్నారు.

సబ్సిడీ విత్తనాలు పంపిణీ చేయాలి: సీపీఐ

డోన్ టౌన్, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): రైతులు పంటలు సాగు చేసుకునేందుకు రైతులకు సకాలంలో సబ్సిడీ విత్తనాలు పంపిణీ చేయాలని సీపీఐ మండల కార్యదర్శి నారాయణ, పట్టణ కార్యదర్శి మోటరాముడు, సహాయ కార్యదర్శి రామ్మోహన్ డిమాండ్ చేశారు. బుధవారం స్థానిక నక్కి రామన్న భవన్‌లో విలేకరులతో మాట్లాడుతూ రైతులు ఖరీఫ్ సాగుకు సిద్ధమవుతున్నారన్నారు. ఎరువులు, రుణాలు మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు.

43 కొత్త పింఛన్లు మంజూరు

ఉయ్యాలవాడ, జూన్ 11 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ఆయా గ్రామాలకు 43 కొత్త పింఛన్లు మంజూరైనట్లు ఎంపీడీవో ఉమామహేశ్వర్‌రావు బుధవారం తెలిపారు. ఈ పింఛన్లను గురువారం పంపిణీ చేయనున్నట్లు ఎంపీడీవో తెలిపారు.

గోడను కూల్చి వేసిన మున్సిపల్ అధికారులు

ఆళ్లగడ్డ జూన్ 11(ఆంధ్రజ్యోతి): ఆళ్లగడ్డలోని భూమా ఘాట్ పక్కన ఉన్న స్థలానికి హద్దుగా నిర్మించిన గోడను బుధవారం మున్సిపల్ అధికారులు కూల్చి వేశారు. మున్సిపల్ కమిషనర్ కిషోర్ ఆధ్వర్యంలో రెండు ఎక్స్‌కవేటర్లతో టౌన్ ప్లానింగ్ అధికారులు కూల్చి వేశారు. విషయం తెలుసుకొన్న పలువురు వైసీపీ నాయకులు సంఘటనా స్థలానికి చేరుకొని మున్సిపల్ అధికారులలో వాగ్వాదానికి దిగారు. దీంతో కొద్దిసేపు ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి.

14న బస్సు పాసులు

డోన్ టౌన్, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 14 నుంచి విద్యార్థులకు బస్సు పాసులు ఇవ్వనున్నట్లు ఆర్‌టీసీ డోన్ డిపో మేనేజర్ శశిభూషణం బుధవారం తెలిపారు. విద్యార్థులు Https://buspassonline.apsrtconline.in/ ఆన్‌లైన్ వెబ్‌లింకులో వివరాలు నమోదు చేసుకుని ప్రింట్ అప్లికేషన్ కోడ్ నెంబర్‌ను కౌంటర్ వద్ద ఇచ్చినట్లయితే బస్సు పాసులు ఇస్తారన్నారు. ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

గరుడ వాహనంపై స్వామివారు

సంజామల,జూన్ 11(ఆంధ్రజ్యోతి): నొస్సం గ్రామంలో వెలిసిన బుగ్గ వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం స్వామివారు గరుడ వాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. వేద పండితులు ఉదయాన్నే అభిషేకాలు, ప్రత్యేక పూజలు చేశారు. స్వామి వారిని అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి గరుడ వాహనంలో గ్రామోత్సవం నిర్వహించారు. గ్రామంలో భక్తులు అమ్మవార్లకు స్వామి వార్లకు ప్రత్యేక పూజలు చేశారు.

శక్తియాప్‌పై అవగాహన ఉండాలి

డోన్ టౌన్, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): మహిళల భద్రత కోసం ప్రభుత్వం ఎంతో ప్రతిష్ఠాత్మకంగా ప్రవేశపెట్టిన శక్తి యాప్‌పై అవగాహన కలిగి ఉండాలని నంద్యాల జిల్లా శక్తి టీం ఇన్‌చార్జి గౌతమి, రూరల్ ఎస్ఐ మమత సూచించారు. బుధవారం మండలంలోని చిన్నమల్కాపురం గ్రామంలో మహిళలకు అవగాహన కల్పిస్తూ శక్తి యాప్ గురించి సైబర్ క్రైం, బాల్య వివాహాలు, తదితర చట్టాలపై నంద్యాల జిల్లా శక్తి టీం ఇన్‌చార్జి గౌతమి, రూరల్ ఎస్ఐ మమత అవగాహన కల్పించారు. మహిళల పట్ల ఎవరైనా అసభ్యకరంగా ప్రవర్తిస్తే 100, 112, అలాగే సైబర్ నెంబర్ 1930లను సంప్రదించాలన్నారు.

తూకాల్లో మోసాలకు పాల్పడరాదు

కొలిమిగుండ్ల, జూన్ 11 (ఆంధ్రజ్యోతి) : దుకాణదారులు తూకాలు, కొలతల్లో మోసాలకు పాల్పడరాదని డోన్ తూనికలు, కొలతల శాఖ ఇన్‌స్పెక్టర్ ఎన్.నరసింహులు అన్నారు. బుధవారం కొలిమిగుండ్ల, అవుకు మండలాల్లోని పలు గ్రామాల్లో ఆయన పర్యటించారు. దుకాణాల్లోని వెయింగ్ మిషన్లు, కొలతల పరికరాలను పరిశీలించారు. కార్యక్రమంలో హెడ్ కానిస్టేబుల్ హనుమాన్‌సింగ్, సిబ్బంది శీను పాల్గొన్నారు.

బాధ్యతలు స్వీకరించిన తహసీల్దార్

కొలిమిగుండ్ల, జూన్ 11 (ఆంధ్రజ్యోతి) : నూతన తహసీల్దార్‌గా ఎం. శ్రీనివాసులు బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రెవెన్యూ సేవలను ప్రజలకు మరింత సులభతరం చేస్తామన్నారు.

వైఎస్ షర్మిల పర్యటనను విజయవంతం చేయండి

డోన్ రూరల్, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షురాలు వైఎస్ షర్మిల పర్యటనను విజయవంతం చేయాలని కాంగ్రెస్ నియోజకవర్గ సమన్వయకర్త గార్లపాటి మద్దిలేటి కోరారు. బుధవారం పట్టణంలోని కాంగ్రెస్ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన సమావేశంలో మద్దిలేటి మాట్లాడుతూ డోన్ నియోజకవర్గంలోని కాంగ్రెస్ కార్యకర్తలు, నాయకులు అభిమానులు నంద్యాలకు తరలిరావాలని కోరారు. సమావేశంలో నాయకులు మల్లెంపల్లె జనార్దన్, జయరాముడు, శేఖర్ యాదవ్, మహేంద్ర నాయుడు, నాగరాజు పాల్గొన్నారు.

కూటమి ప్రభుత్వంలో సుపరిపాలన

- అభివృద్ధి, సంక్షేమమే లక్ష్యం
- రోడ్లు భవనాల శాఖా మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి


విజయోత్సవ ర్యాలీలో పాల్గొన్న మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి, నాయకులు

బనగానపల్లె, జూన్ 11(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వంతో రాష్ట్రంలో సుపరి పాలన కొనసాగుతోందని రోడ్లు భవనాల శాఖామంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి అన్నారు. బుధవారం బనగానపల్లె పట్టణంలోని కూటమి ప్రభుత్వం ఏడాది పాలన సందర్భంగా మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి ఆధ్వర్యంలో విజయోత్సవ ర్యాలీ నిర్వహించారు. టీడీపీ నాయకులు, కార్యకర్తలు భారీ సంఖ్యలో తరలివచ్చి ఈ ర్యాలీలో పాల్గొన్నారు. మంత్రి క్యాంపు కార్యాలయం నుంచి ఆస్థానం, పెట్రోల్‌బంకు కూడలిమీదుగా ఎంపీ డీవో కార్యాలయం వరకు ర్యాలీ జరిగింది. ఈసందర్భంగా బనగానపల్లె నియోజకర్గంలో జరిగిన అభివృద్ధి పనులకు సంబంధించి శిలాఫలకాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి బీసీ మాట్లాడుతూ అభివృద్ధి, సంక్షేమమే లక్ష్యంగా సీఎం చంద్రబాబు పాలన కొనసాగిస్తున్నారన్నారు. పీఎం నరేంద్రమోదీ సహకారంతో సీఎం చంద్రబాబు రాష్ట్రానికి నిధులు రాబడుతూ పాలనను గాడిలో పెడుతున్నారన్నారు. అభివృద్ధి, సంక్షేమం టీడీపీతోనే సాధ్యమవుతుందన్నారు. ప్రజల సమస్యలను పరిష్కరించడానికి చిత్తశుద్ధితో పనిచేస్తామని మంత్రి బీసీ తెలిపారు. క్యాంపు కార్యాలయంలో జిల్లాలోని వివిధ గ్రామాల నుంచి వచ్చిన ప్రజల వినతులు స్వీకరించారు. ఆయా వినతులు పరిశీలించి సంబంధిత అధికారులతో ఫోన్‌లోనే మాట్లాడి సమస్యలు పరిష్కరించారు. కొన్ని సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువచ్చి పరి ష్కరించేలా కృషి చేశారు.

అవినీతికి అంబాసిడర్ కాటసాని

- అభివృద్ధిపై చర్చకు రావాలని మంత్రి బీసీ సవాల్


సభలో మాట్లాడుతున్న మంత్రి బీసీ

బనగానపల్లె: అవినీతికి బ్రాండ్ అంబాసిడర్ కాటసాని రామిరెడ్డి అని రోడ్లు భవనాల శాఖామంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి విమర్శించారు. బుధవారం పట్టణంలో విజయోత్సవ ర్యాలీ అనంతరం జరిగిన బహిరంగ సభలో కాటసానిపై మంత్రి విమర్శించారు. కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏడాది పాలనలో తాను చేసిన అభివృద్ధి పనులు చూస్తున్నా తమపై కాటసాని విమర్శించడం దారుణమన్నారు. కేవలం రాజకీయ ఉనికి కోసమే కాటసాని తనపై విమర్శల చేస్తున్నారన్నారు. గతంలో ఆయన హయాంలో జరిగిన అభివృద్ధి, తాను చేసిన అభివృద్ధిపై చర్చకు రావాలని సవాల్ విసిరారు. కాటసాని రామిరెడ్డి తన రాజకీయ ఉనికికోసం తనపై ఆరోపణలు చేయడం సరికాదన్నారు.

అభివృద్ధే లక్ష్యం : ఎమ్మెల్యే


శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి

డోన్ రూరల్/ప్యాపిలి, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గ అభివృద్ధే తమ లక్ష్యమని ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి స్పష్టం చేశారు. కూటమి ప్రభుత్వం ఏర్పడి సంవత్సర కాలం పూర్తిచేసుకున్న సందర్భంగా మండలంలోని ఉడుములపాడు గ్రామంలో పలు అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. అలాగే పట్టణ సమీపంలోని కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయం జూనియర్ కళాశాలలో డార్మిటర్ భవనానికి, మౌలిక వసతుల కల్పన పనులకు శంకుస్థాపన చేశారు. ప్యాపిలి మండలంలో రూ.3.8కోట్లతో నిర్మించిన చిన్నపూదిళ్ల- గుండాల బీటీ రోడ్డును ప్రారంభించారు. రూ.3.24కోట్లతో చేయనున్న గార్లదిన్నె-కోన రోడ్డుకు శంఖుస్థాపన చేశారు. ఆయా కార్యక్రమాల్లో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి వలసల రామకృష్ణ, సీనియర్ నాయకులు లక్ష్మసాగరం లక్ష్మిరెడ్డి, ఓబులాపురం శేషిరెడ్డి, ఆర్డీవో నరసింహులు, మండల ఏఈ నారాయణ, ఉడుములపాడు గ్రామ సర్పంచ్ రాధమ్మ, గ్రామ టీడీపీ నాయకులు రామాంజనేయులు, ఓంప్రకాష్ , ప్యాపిలి తహసీల్దారు భారతి, ఎంపీడీవో శ్రీనివాసరావు, ఏఈ ప్రభాకర్‌రెడ్డి, నాయకులు ఎద్దులదొడ్డి ప్రభాకర్‌రెడ్డి, వైలక్ష్మీనారాయణ యాదవ్, అలేబాదు పరమేష్, ప్రసాద్‌రెడ్డి, రమేష్‌గౌడు, విష్ణువర్ధన్‌రెడ్డి, దస్తగిరి, శివ పాల్గొన్నారు.

నియోజకవర్గాన్ని అభివృద్ధి చేస్తా

- ఆళ్లగడ్డ ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ


భూమి పూజ చేస్తున్న ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ

ఆళ్లగడ్డ జూన్ 11(ఆంధ్రజ్యోతి): నియోజకవర్గాన్ని అభివృద్ధి చేసి చూపిస్తానని ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ అన్నారు. బుధవారం పలు అభివృద్ధి కార్యక్రమాలకు ఎమ్మెల్యే భూమి పూజ చేశారు. ఆళ్లగడ్డలోని అభిరుచి హోటల్ నుంచి సెయింట్ ఆన్స్ పాఠశాల వరకు నూతనంగా నిర్మించనున్న సీసీ రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. అలాగే గూబగుండం గ్రామంలో పంచాయతీరాజ్, చింతకుంట గ్రామంలో ఆర్ఎండీ నిధులతో చేపట్టిన సీసీ రోడ్డు పనులను ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మూడు ప్రాంతాలలో రూ 13.45కోట్లు వెచ్చించి రోడ్ల నిర్మాణాలు చేపట్టినట్లు తెలిపారు. ఎప్పుడు తమపై వైసీపీ నాయకులు వ్యక్తిగత ఆరోపణలతోనే సరిపోతుందని అన్నారు. ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన సూపర్‌సిక్స్ హామీలు అన్నింటిని తమ ప్రభుత్వం చిత్తశుద్ధితో అమలు చేస్తుందన్నారు. త్వరలోనే తల్లికి వందనం మొత్తాన్ని తల్లుల ఖాతాల్లో జమ చేస్తారన్నారు. ఒక్కొక్క హామీని నెరవేర్చుకుంటూ ప్రభుత్వం పోతోందన్నారు. సెయింట్ ఆన్స్ పాఠశాల వద్ద విద్యార్థులు రోడ్డు సౌకర్యం లేక ఇబ్బందులు పడుతున్నారని విషయాన్ని తాము గుర్తించి గతంలోనే రోడ్డు మంజూరు చేస్తామని హామీ ఇచ్చిమని అందుకే 15 ఫైనాన్స్ నిధులతో రోడ్డు పనులు చేపట్టినట్లు వివరించారు. కార్యక్రమంలో కమిషనర్ కిషోర్, ఇన్‌చార్జి శానిటరీ ఇన్‌స్పెక్టర్ బాలస్వా మి, కౌన్సిలర్ హుసెన్‌బాష, నాయకులు శ్రీనివాసరెడ్డి, రామాచారి పాల్గొన్నారు.

ఘనంగా ఏరువాక పౌర్ణమి

చాగలమర్రి, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): చాగలమర్రి గ్రామంలో వర్షరుతువు ప్రారంభంలో వచ్చే ఏరువాక పౌర్ణమి పండుగను ఏవో రంగ నేతాజీ, టీడీపీ యువనాయకుడు జెట్టికుమార్ ఆధ్వర్యంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. రైతు గఫార్ పొలంలో ఏరువాక పౌర్ణమి సందర్భంగా పూజలు జరిపి ఎద్దులతో సేద్యపు పనులు ప్రారంభించారు. కార్యక్రమంలో ఏఈవో మంజుల, వ్యవసాయ సిబ్బంది అస్రఫ్, సుబ్బరాయుడు, దేవేంద్ర, రైతులు పాల్గొన్నారు.

కోవెలకుంట్ల : మండల పరిధిలోని కలుగొట్ల గ్రామంలో బుధవారం ఏరువాక పౌర్ణమి వేడుకలు నిర్వహించారు. మండల వ్యవసాయాధికారి నిరంజన్ రైతులతో కలిసి సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

చిన్నారులను బడిలో చేర్పించాలి

బనగాన పల్లె, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): చిన్నారులను బడిలో చేర్పించాలని జేకేఆర్ సంక్షేమ సంఘం అధ్యక్షుడు బ్రహ్మానందాచారి కోరారు. బుధవారం పలుకూరు జడ్పీ ఉన్నత పాఠశాలలో బడిబాట కరపత్రికను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పిల్లలను ఇంటి వద్ద పని చేయించకుండా బడిలో చేర్పించాలని కోరారు. పిల్లలకు ఆస్తులు ఇవ్వాల్సిన పనిలేదని, చదివిస్తే చాలన్నారు. ప్రభుత్వ పాఠశాలలను ప్రోత్సహించాలన్నారు. కార్యక్రమంలో చంద్రశేకరాచారి, శ్రీనివాసయాదవ్, మద్దయ్య, సుబ్బయ్య, సరేశ్ తదితరులు పాల్గొన్నారు.

యోగాంధ్రను విజయవంతం చేయండి

కొలిమిగుండ్ల, జూన్ 11 (ఆంధ్రజ్యోతి) : ఈనెల 13న బెలుం గుహల ఆవరణంలో నిర్వహించనున్న యోగాంధ్ర కార్యక్రమాన్ని అన్నివర్గాల ప్రజలు విజవంతం చేయాలని డోన్ ఆర్డీవో నరసింహులు, డివిజనల్ అభివృద్ధి అధికారి నరసింహారెడ్డి కోరారు. బుధవారం ఎంపీడీవో కార్యాలయంలో యోగాంధ్ర కార్యక్రమంపై వివిధ శాఖల అధికారులు, సిబ్బందితో సమీక్షా సమావేశం నిర్వహించారు. సమావేశంలో ఏపీ టూరిజం పీడీ సత్యనారాయణ, ఎంపీడీవో ప్రసాదరెడ్డి, తహసీల్దార్ శ్రీనివాసులు, ఆయాశాఖల అధికారులు పాల్గొన్నారు.

డోన్ తహసీల్దార్‌గా రవికుమార్

డోన్ టౌన్, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): డోన్ తహసీల్దార్‌గా రవికుమార్ బుధవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. ముందుగా ఆర్డీవో నరసింహులును మర్యాదపూర్వకంగా కలిశారు. నూతన తహసీల్దార్‌కు డీటీ సునీల్‌రాజా, సర్వేయర్ జగదీష్, వీఆర్వోలు రామకృష్ణారెడ్డి, భాస్కర్ నాయుడు, కృష్ణమూర్తి, ఖాజా, మనోహర్, కంప్యూటర్ ఆపరేటర్ దీపక్ బొకే అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

ఎమ్మెల్యేను కలిసిన తహసీల్దార్

డోన్ నూతన తహసీల్దార్‌గా బాధ్యతలు చేపట్టిన రవికుమార్ డోన్ ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాష్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఇక్కడ పని చేస్తున్న తహసీల్దార్ నాగమణి బదిలీ కావడంతో ఆయన స్థానంలో వచ్చిన రవికుమార్ బుధవారం బాధ్యతలు చేపట్టారు.

రైతులు, ప్రజల సమస్యలు పరిష్కరించాలి

బేతంచెర్ల, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వివిధ గ్రామాల్లో ఉన్న రైతులకు, ప్రజలకు అందుబాటులో ఉండి సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేయాలని తహసీల్దార్ నాగమణి సూచించారు. బుధవారం బేతంచెర్ల తహసీల్దార్‌గా నాగమణి బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా తహసీల్దార్‌కు డీటీ మారుతి, ఆర్ఐ హేమంత్ కుమార్ రెడ్డి, సీనియర్ అసిస్టెంట్ శ్రీదేవి, సిబ్బంది బొకేను అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

కార్మికులకు న్యాయం చేయాలి

బేతంచెర్ల, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సిమెంటునగర్ గ్రామంలో ఉన్న పాణ్యం సిమెంటు ప్యాక్టరీ యాజమాన్యం కార్మికులకు న్యాయం చేయాలని ప్యాక్టరీ కార్మికులు డిమాండ్ చేశారు. మూత పడిన సిమెంటు ప్యాక్టరీ ముందు శాంతియుతంగా కార్మికులు చేపట్టిన దీక్షలు బుధవారం 10వ రోజుకు చేరుకున్నాయి. బేతంచెర్ల నుంచి ఆకుమల్ల సుబ్బారెడ్డి, డోన్ నుంచి బాలాజీ పవులూరు నాయకులు సంఘీభావం తెలిపారు. దీక్షలో మోజెస్, రామసుబ్బయ్య, రామంజనేయులు, హనీఫ్, రంగన్న శ్రీనివాసులు, చంద్రశేఖర్, మద్దయ్యలకు టీడీపీ నాయకులు రాముడు, ఉరుకుందు, సుభాన్, ఇమ్మానుయేల్, వెంకటేశ్వర్లు, వాసులు ఉన్నారు.

నేడు మోగనున్న బడి గంట

- ఇప్పటికే పాఠశాలలకు చేరిన పుస్తకాలు, యూనిఫాం


ప్రారంభానికి ముస్తాబైన మోడల్ స్కూల్

కొలిమిగుండ్ల, జూన్ 11 (ఆంధ్రజ్యోతి) : సుదీర్ఘ వేసవి సెలవుల అనంతరం నేడు (గురువారం) పాఠశాలలు తిరిగి ప్రారంభం కానున్నాయి. దీంతో పిల్లలు ఆట పాటలకు టాటా చెప్పి బడి బాట పట్టనున్నారు. జిల్లాలో అన్ని ప్రభుత్వ, ఎయిడెడ్, ప్రైవేట్ యజమాన్య పాఠశాలలు తెరుచుకోనున్న నేపథ్యంలో జిల్లా విద్యాశాఖ అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. ప్రభుత్వం ముందు చూపుతో ఇప్పటికే 90శాతం పుస్తకాలను పాఠశాలలకు చేరవేసింది. మండలంలో 47 ప్రాథమిక పాఠశాలలు, 10 ఉన్నత పాఠశాలలతో పాటు కస్తూర్బాపాఠశాల, మోడల్‌స్కూల్, 10 ప్రైవేటు పాఠశాలలు ఉన్నాయి. వీటికి సంబంధించి 4,130 పుస్తకాలు అవసరం అవుతాయని ప్రతిపాదనలు పంపగా, మొదటి, రెండు విడతల్లో 3800 పుస్తకాలు అందుబాటులోకి వచ్చినట్లు అధికారులు వెల్లడించారు. మరోవైపు యూనిఫాం, స్కూల్ బ్యాగులు సైతం అందుబాటులోకి రావడంతో వీటిని విద్యాశాఖ అధికారులు ఆయా పాఠశాలలకు ఇప్పటికే పంపింది. గురువారం పాఠశాలలు ప్రారంభం కాగానే వీటిని విద్యార్థులకు పంపిణీ చేయనున్నారు.

డీఎస్సీతో తీరనున్న ఉపాధ్యాయుల కొరత

మరోవైపు కూటమి ప్రభు త్వం ఎన్నిక ముందు ఇచ్చి న హామీమేరకు డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేసి, పోటీ పరీక్షలు నిర్వహిస్తోంది. త్వరలోనే ఫలితాలు విడుదల చేసి, ఉపాధ్యాయుల నియామాకాలు చేపట్ట నుంది. దీంతో ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయుల కొరత తీరనుంది. విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ ఎంతో ప్రతిష్ఠాత్మకంగా భావించి, విద్యాశాఖను పటిష్ఠం చేస్తుండటం పట్ల తల్లిదండ్రుల్లో హర్షం వ్యక్తమవుతోంది.

గంగా భవానికి సామూహిక వడి బియ్యం


గంగా భవానికి పూజలు చేస్తున్న మహిళలు

చాగలమర్రి, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): చాగలమర్రి గ్రామంలోని చెరువుకట్ట వద్ద వెలసిన గంగాభవాని మాతకు మహిళలు సామూహికంగా వడిబియ్యం కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. బుధవారం పౌర్ణమి సందర్భంగా అమ్మవారికి సారె సమర్పించి ప్రత్యేక పూజలు చేశారు. భజన, మంగళహారతి కార్యక్రమాలు చేశారు. భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఆలయ అధ్యక్షుడు లక్ష్మయ్య, హిందూ సంఘ సభ్యులు శివశంకర్, వెంకటరమణ, జయదేవరెడ్డి, సుధాకర్, శేషాద్రి, పవన్, మహిళలు పాల్గొన్నారు.

రేషన్ సక్రమంగా పంపిణీ చేయాలి

చాగలమర్రి, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో డీలర్లు కార్డుదారులకు రేషన్ సక్రమంగా పంపిణీ చేయాలని ఇన్‌చార్జి తహసీల్దార్ విజయ్‌కుమార్ తెలిపారు. బుధవారం ఇన్‌చార్జి తహసీల్దార్‌గా బాధ్యతలు చేపట్టిన డీటీ విజయ్‌కుమార్ మాట్లాడుతూ డీలర్లు సమయ పాలన పాటిస్తూ కార్డుదారులందరికీ చక్కెర, బియ్యం పంపిణీ చేయాలని అన్నారు. కార్డుదారులు ఫిర్యాదు చేస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. దుకాణాలను మూతవేయరాదని సూచించారు. కార్యక్రమంలో సీనియర్ సహాయకులు దస్తగిరి, ఆర్ఐ అబ్దుల్‌సత్తార్ ఉన్నారు.

పండ్ల తోటల సాగును ప్రోత్సహించాలి

చాగలమర్రి, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో రైతులు పండ్ల తోటలు సాగు చేసుకునేలా ఉపాధి సిబ్బంది ప్రోత్సహించాలని ఏపీవో ఖాసీంసాహెబ్ సూచించారు. బుధవారం ఉపాధి కార్యాలయంలో టీఏ, ఎఫ్ఏల సమావేశం నిర్వహించారు. వందశాతం సబ్సిడీతో 16 రకాల పండ్ల తోటల మొక్కలను పంపిణీ చేస్తామన్నారు. మూడేళ్ల పాటు రైతులకు ఉపాధి నిధులు ఖర్చు చేయనున్నట్లు తెలిపారు. 220 ఎకరాల్లో సాగు లక్ష్యంగా ఉందన్నారు. రైతులను ప్రోత్సహించాలని సూచించారు. ఉపాధి సిబ్బంది పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో పిల్లలను చేర్పించాలి

చాగలమర్రి, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో తల్లిదండ్రులు తమ పిల్లలను చేర్పించాలని ఎంఈవోలు అనూరాధ, న్యామతుల్ల కోరారు. బుధవారం ఎమ్మార్సీ కార్యాలయంలో వారు మాట్లాడుతూ 650 మంది విద్యార్థులు డ్రాపౌట్స్‌గా ఉన్నారని, వారందరిని తిరిగి బడిలో చేర్పించేందుకు విద్యాశాఖ సిబ్బంది ఎన్రోల్‌మెంట్ సర్వే చేసి బడిలో చేర్పించారని అన్నారు. ఇంటింటికి వెళ్లి తల్లిదండ్రులతో మాట్లాడి పిల్లలను బడిలో చేర్పించాలని కోరారు. కార్యక్రమంలో సీఆర్పీలు పాల్గొన్నారు.

ఉపాధి నిధులతో కొత్త రోడ్డు


వివరాలు తెలుసుకుంటున్న ఎంపీడీవో భాగ్యలక్ష్మి

రుద్రవరం, జూన్ 11 (ఆంధ్రజ్యోతి) : ఉపాధి హామీ నిధులతో కొత్త రోడ్డును ఏర్పాటు చేస్తున్నట్లు ఎంపీడీవో భాగ్యలక్ష్మి తెలిపారు. బుధవారం రుద్రవరం సమీపంలో జంబులపరమేశ్వరి దేవాలయానికి వెళ్లే రహదారి లేకపోవడంతో కొత్తగా రోడ్డును వేస్తున్నట్లు ఆమె తెలిపారు. ఈ రోడ్డు పనులకు ఉపాధి నిధులు వెచ్చిస్తున్నట్లు వివరించారు. ఈ రోడ్డు పనులను పూర్తి చేస్తే అమ్మవారి దేవాలయానికి వెళ్లే భక్తులకు సౌకర్యంగా ఉంటుందని అన్నారు. కూలీలకు మస్టరు అక్కడే వేయాలని సూచించారు. మస్టర్లను తనిఖీ చేశారు. ప్రతి మస్టరు సక్రమంగా ఉంచాలన్నారు. కార్యక్రమంలో ఈసీ సుబ్బన్న, టీఏ నాగేంద్ర పాల్గొన్నారు.

18న మండల సర్వసభ్య సమావేశం

రుద్రవరం, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): రుద్రవరం మండల పరిషత్ సమావేశ భవనంలో ఈ నెల 18న మండల సర్వసభ్య సమావేశాన్ని ఎంపీపీ బాలస్వామి అధ్యక్షతన నిర్వహించనున్నట్లు ఎంపీడీవో భాగ్యలక్ష్మి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలస్థాయి అధికారులు, ప్రజాప్రతినిధులు సర్వసభ్య సమావేశానికి హాజరుకావాలని కోరారు. అన్నిశాఖల అధికారులు ప్రగతి నివేదికలతో పాల్గొనాలని సూచించారు.

చిన్నారులకు సామూహిక అక్షరాభ్యాసం


కోటపాడులో సామూహిక అక్షరాభ్యాసంలో పాల్గొన్న చిన్నారులు

శిరివెళ్ల, జూన్ 11(ఆంధ్రజ్యోతి) : దానదర్మ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో మండలంలోని కోటపాడు గ్రామంలోని చెన్నకేశవ, వీరభద్ర స్వామి ఆలయంలో చిన్నారులకు సామూహిక అక్షరాభ్యాస కార్యక్రమాన్ని బుధవారం వైభవంగా నిర్వహించారు. ట్రస్ట్ మండల ధర్మప్రచారక్ అన్నెం నాగమల్లేశ్వరరెడ్డి పర్యవేక్షణలో అర్చకుల వేద మంత్రోచ్ఛరణాలతో చిన్నారులు పలక, బలపం చేతబట్టి అక్షరా భ్యాసం చేశారు. కార్యక్రమంలో గ్రామపెద్దలు పాల్గొన్నారు.

వంట సామగ్రి వితరణ

ఆళ్లగడ్డ, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ పుణ్యక్షేత్రమైన అహోబిలం లక్ష్మీనరసింహస్వామి ఆలయానికి వంట సామగ్రిని బుధవారం వితరణ చేశారు. ఆళ్లగడ్డకు చెందిన కుమార్ సప్లయర్స్ అధినేత లక్ష్మీనరసింహ కుమార్ రూ.1.30లక్షల విలువ చేసే వంట సామగ్రిని ప్రధాన పూజారులకు అందజేశారు. దాత కుమార్‌ను ప్రధాన అర్చకులు కిడాంబి వేణుగోపాల్‌స్వామి ఆశీర్వదించారు.

యాజమాన్య పద్ధతులపై అవగాహన

బేతంచెర్ల, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): ఖరీఫ్ సీజన్‌లో పంటల సాగుపై యాజమాన్య పద్ధతులను కేవీకే శాస్త్రవేత్తలు అవగాహన సదస్సు నిర్వహించారు. బుధవారం మండలంలోని ఆర్ఎస్ రంగాపురం రైతుసేవా కేంద్రం- 2లో కృషి విజ్ఞాన కేంద్రం యాగంటిపల్లె ఆధ్వర్యంలో రైతులకు అవగాహన కల్పించారు. సదస్సులో శాస్త్ర వేత్తలు లక్ష్మిప్రియ, సుగుణ, వీఏఏలు భారతి, యశోద, వీహెచ్ఏ సుధాకర్ రెడ్డి, రైతులు పాల్గొన్నారు.

మంత్రి బీసీని కలిసిన సీఐ

బనగానపల్లె, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): మంత్రి బీసీ జనార్దన్ రెడ్డిని బనగానపల్లె నూతన ఎక్సైజ్ సీఐ సతీష్ బుధవారం రాత్రి మంత్రి క్యాంపు కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. బనగానపల్లె ఎక్సైజ్ సీఐ వర్ధనాదేవి కళ్యాణదుర్గానికి బదిలీ అయ్యారు. ఆమె స్థానంలో సతీష్ బనగానపల్లెకు బదిలీపై వచ్చారు.

హత్య కేసులో నిందితుడి అరెస్టు

చాగలమర్రి, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని శెట్టివీడు గ్రామంలో పొలం తగాదా, ఆస్తి కోసం ఈనెల 8న కట్టుబడి మదార్‌సా అనే వృద్ధుడిని హత్య చేసిన కేసులో మనవడైన ఉసేన్‌సా అనే యువకుడిని బుధవారం చాగలమ్మ దేవాలయం సమీపం లో అరెస్టు చేసినట్లు ఆళ్లగడ్డ రూరల్ సీఐ మురళీధర్‌రెడ్డి తెలిపారు. శెట్టివీడు గ్రామంలోని మసీదు ఆవరణలో గొడ్డలితో నరికి హత్య చేసిన విషయం విధితమే. కేసుకు సంబంధించి నిందితుడిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ తెలిపారు. కార్యక్రమంలో ఎస్ఐ సురేష్, పోలీసులు ఉన్నారు.